ఒక్కోల్యాబ్ ..ఒక్కోరకం

- ప్రైవేట్ డయాగ్నోస్టిక్స్ సెంటర్లలో దోపిడీ
- వాస్తవ ధరలకంటే రెండింతలు వసూలు
- ఒకేపరీక్షకు రెండుల్యాబ్‌లల్లో వేర్వేరు రిపోర్టులు
- తాము రాసిన దగ్గరికే వెళ్ళాలంటున్న డాక్టర్లు
- ఇబ్బందిపడుతున్న రోగులు

హైదరాబాద్, అక్టోబరు 26,ప్రభాతవార్త: ఉప్పల్ ప్రాంతానికి చెందిన నరేష్ ఆప్రాంతంలో పేరుమోసిన ఓప్రైవేట్ డయాగ్నోస్టిక్స్ సెంటర్ బ్రాంచిలో కాల్షియం టెస్ట్ చేయించుకుని ఆరిపోర్టును సికింద్రాబాద్‌లోని ఓకార్పొరేటర్ ఆసుపత్రికి తీసుకెళ్లాడు. అక్కడ ఆరిపోర్టులో కాల్షియం ఎక్కువగా ఉందని డాక్టర్ చెప్పారు. అయినప్పటికి రిపోర్టుపై అనుమానం వచ్చి అదేఆసుపత్రిలో టెస్ట్ చేయించగా రిపోర్టు నార్మల్‌గా వచ్చింది. దీంతో ఉప్పల్ డయాగ్నోస్టిక్స్ సెంటర్‌లో చేయించిన రిపోర్టు తప్పుగా ఉందని డాక్టర్ నిర్ధారించారు. ఇది కేవలం ఒక నరేష్‌కే కాదు తరచూ నగరంలో వివిధ డయాగ్నోస్టిక్ సెంటర్లకు వెళ్తున్న రోగులకు జరగుతున్న సంఘటనలు.. ఒకేరకమైన టెస్ట్‌కు వివిధ డయాగ్నోస్టిక్ సెంటర్లలో వేర్వేరు రిపోర్టులు రావడంతో పలువురు రోగులు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. తప్పుడు రిపోర్టుల వల్ల మందులుతిని లేనిరోగాలు తెచ్చుకోవాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తంచేస్తున్నారు.

అడ్డగోలు రేట్లు..

ప్రైవేట్ ల్యాబ్‌ల నిర్వాహకులు వాస్తవ ఫీజుకంటే రెండు మూడు రెట్లు ఎక్కువగా వసూలు చేస్తూ దోపిడీకి పాల్పడుతున్నారు. బాధితుల అవసరాన్ని భట్టి రేట్లు పెంచేస్తున్నారు. వాస్తవానికి ఏటెస్టుకు ఎంత వసూలు చేయాలనేది ఖచ్చితంగా బోర్డు ఏర్పాటు చేయాల్సి ఉంటుంది. కానీ చాలా ల్యాబ్‌లలో అలాంటి బోర్డులు కనిపించడం లేదు. మరోవైపు ప్రైవేట్ ఆసుపత్రులకు వస్తున్న బాధితులను అక్కడి వైద్యులు ఖచ్చితంగా పలానా స్కానింగ్ సెంటర్‌కే వెళ్ళాలని రిఫర్ చేస్తున్నారు. మరికొన్ని ఆసుపత్రుల్లో తమకు కమిషన్లు వస్తాయని ఆంబులెన్స్‌లో తీసుకెళ్ళి చేయించుకుని తీసుకువస్తున్నారు. దీంతో గర్భిణీలు, రోగులు ఆర్థికంగా సతమతమవుతున్నారు.

కనిపించని రేడియాలజిస్టులు..

వాస్తవానికి ప్రతి ల్యాబ్, స్కానింగ్ సెంటర్లలో రేడియాలజిస్టు తప్పనిసరిగా ఉండాలి. రోగిని స్కానింగ్ తీసి సంబంధించిన రిపోర్టు ఆరేడియాలజిస్టు ద్వారానే అందజేయాలి. కానీ కొన్ని స్కానింగ్ సెంటర్లలో రేడియాలజీ డాక్టర్ పేరుతో ఒక క్యాబిన్, ఒక నేమ్‌బోర్డు ఏర్పాటు చేసి ఉంచుతున్నారు. కానీ అక్కడ డాక్టర్ మాత్రం కనిపించడు. స్కానింగ్ సెంటర్ల నిర్వాహకులు ఆ రేడియాలజిస్టు డాక్టర్ల పేర్లను, లెటర్‌ప్యాడ్‌లను వాడుకుంటూ వారికి కొంత సొమ్మును ముట్టచెప్పుతున్నారు. ఇలా టెస్టులు మాత్రం అవగాహన లేని సిబ్బందితో చేయిస్తూ రిపోర్టులు ఇచ్చి పంపుతున్నారు. ప్రైవేట్ ఆసుపత్రుల్లో సిటీస్కానింగ్ సెంటర్లలో నిలువుదోపిడీ జరుగుతున్నా వైద్యఆరోగ్యశాఖ కన్నెత్తి చూడటం లేదు.

ప్రమాదకర స్థాయికి ఎయిర్ క్వాలిటీ

-అనారోగ్య సమస్యలున్న వారికి మరింత ప్రమాదకం -ఇండస్ట్రియల్ ఏరియాల్లో అధ్వాన పరిస్థితులు

హైదరాబాద్, అక్టోబరు 26 ప్రభాతవార్త

కాలుష్యం తీవ్రస్థాయికి చేరి వాతావరనంలో ప్రాణవాయువు పడిపోతోంది. నగరంలోఎయిర్ క్వాలిటీ ఇండెక్స్ ఆన్ హెల్తి కండీషన్‌ను చూపిస్తోంది. సాధారణంగా ఉండే ఎయిర్ కన్‌ట్రక్షన్, ఇండస్ట్రీయల్ పొల్యూషన్‌కు ఇటీవల చలి కూడా తోడవడంతో సమస్య మరింత తీవ్రంగా మారింది. ఇలాంటి వాతావరణం జనాల అనారోగ్యంతో ఉన్న వారికి మరింత ప్రమాదకరమని పర్యావరణ వేత్తలు పేర్కొంటున్నారు. అస్తమా, ఇతర ఊపిరితిత్తుల సమస్యలు, గుండె జబ్బులు, షుగర్, బీపీ లాంటివి ఉన్నవాళ్లు జాగ్రత్తగా ఉండాలని సూచిస్తున్నారు. ఇలాంటి వాతావరణం కారణంగా అరోగ్యంగా ఉన్నవారికి సైతం కొత్త జబ్బులు వచ్చే అవకాశాలున్నాయని హెచ్చరిస్తున్నారు.

మూడు రెట్లు ఎక్కువగా పొల్యూషన్..

మరోవైపు వెహికల్ పొల్యూషన్‌తో ఎయిర్ క్వాలిటీ ఆధ్వాన్నంగా మారుతోంది. ఇండస్ట్రియల్ ఏరియాల్లో ఈ సమస్య అధికంగా ఉంటోంది. 50 నుంచి 100 మధ్యలో ఉండాల్సిన ఎయిర్ క్వాలిటీ ఇండెక్స్ సిటీలోని అనేక ఏరియాల్లో 100 నుంచి 150 మధ్య ఉంది. అన్ హెల్తీ ఎయిర్ క్వాలిటీని చూపిస్తోంది. డబ్ల్యూ హెచ్‌వో సూచించిన ఎయిర్ క్వాలీటీ పీఎం 2.5(కాలుష్య కారకాలు) ప్రమాణాల కంటే సిటీలో 3.1 రేట్ల ఎక్కువగా ఉన్నట్లు హైదరాబాద్ ఎయిర్ క్వాలిటీ ఇండెక్స్ సైట్‌లో పేర్కొంది. నగరంలోని జీడిమెట్ల, నాచారం, ఉప్పల్, పాశమైలారం, మల్లాపూర్, గడ్డిపోచారం, కుత్బుల్లాపూర్, చర్లపల్లి, గాజులరామారం, బాచుపల్లి, ప్రగతినగర్, పటాన్‌చెరు వంటి పలుప్రాంతాల్లో ఫార్మసీకి చెందిన బల్క్ డ్రగ్ ఫ్యాక్టరీలు, కెమికల్ ఫ్యాక్టరీల నుంచి వెలువడే కెమికల్స్ కారణంగా ఈ ప్రాంతాల్లో పరస్థితి దారుణంగా ఉంటోంది.

ఫ్యాక్టరీల నుంచి గ్యాస్, పొగ...

ఫ్యాక్టరీల నుంచి వెలువడే గ్యాస్, పొగ కలిసి ఏర్పాటే పొగ, దీంతో పాటు వెహికల్స్ నుంచి వచ్చే పొగ కారణంగా చాలా మంది ఊపిరితిత్తుల సంబంధిత సమస్యల బారిన పడుతున్నారని డాక్టర్లు చెపుతున్నారు. గతంలో పోలిస్తే ప్రస్తుతం ఈ తరహా కేసులు పెరుగుతున్నాయని పేర్కొంటున్నారు. వీటితో పాటు తీవ్రమైన తలనొప్పి, సైనస్, కంటి సమస్యలు, వీక్ నెస్ వంటి హెల్త్ ఇష్యూస్ వస్తున్నాయని బాధితులు పేర్కొంటున్నారు. ఉదయం చలి..మధ్యాహ్నం ఎండలు నెలకొన్న నేపథ్యంలో చలి కారణంగా చర్మ సంబంధిత వ్యాధులైన అలర్జీ, వాంతులు వంటి సమస్యలు వస్తున్నాయని అంటున్నారు. ముఖ్యంగా వృద్ధులు శ్వాస తీసుకోవడంలో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

వెహికల్స్ ఎక్కువతుండటంతో..

వెహికల్స్ సంఖ్య పెరగడమే పొల్యూషన్‌కు ప్రధాన కారణమని పర్యావరణ వేత్తలు అంటున్నారు. నగరంలో కోటికిపైగా జనాభా ఉండగా, వాహనాల సంఖ్య సుమారు 80లక్షలకు చేరింది. వీటిలో 70 శాతం వరకు టూవీలర్స్ ఉండగా, 10 శాతం కార్లు ఉంటాయని, మిగతావి ఆటోలు ఇతరత్రా వెహికల్స్ అని ట్రాన్స్‌పోర్టు అధికారులు పేర్కొంటున్నారు. ప్రతి ఏడాది బైక్‌ల రిజిస్ట్రేషన్ 15శాతం, కార్ల రిజిస్ట్రేషన్లు 10 శాతం పెరుగుతున్నాయని పేర్కొంటున్నారు. ఈ వెహికల్స్ నుంచి వెలువడే పొగతో గాలిలో కాలుష్య తీవ్రత పెరిగిపోతోంది.

రెసిడెన్షియల్ ఏరియాల్లో చెత్తను తగులపెట్టొద్దు..

ఇండస్ట్రియల్ ఏరియాలో వెహిల్స్ పరిశ్రమల నుంచి వెలువడే కెమెకల్ గ్యాస్ వల్ల అక్కడి జనం అనారోగ్యాల బారిన పడుతున్నారు. మరోవైపు జిహెచ్ఎంసి, శివారు ప్రాంతంలోని మున్సిపల్ ఏరియాల్లో చెత్తను కాలుస్తున్నారు. దీనివల్ల కూడా పొల్యూషన్ ఏర్పడుతోంది. ప్రభుత్వం వీటిని దృష్టిలో పెట్టుకొని చర్యలు చేపట్టాలని, పాత వెహికల్స్ కారణంగా రెట్టింపు పొల్యూషన్ అవుతోంది. పాత వెహికిల్స్‌ను తీసేయాలని 2003 లో సుప్రీంకోర్టు చెప్పినప్పటికీ అది ఇంప్లిమెంట్ కావడంలేదని పలువురు పర్యావరణవేత్తలు పేర్కొంటున్నారు.

ప్రగతినగర్‌లో కెమికల్ బాంబ్..

-ప్రజల ఊపిరి తీస్తున్న ఫ్యాక్టరీలు..



నిరసన తెలుపుతున్న స్థానికులు

నిజాంపేట్, అక్టోబర్ 26, ప్రభాతవార్త

హైదరాబాద్ ప్రగతినగర్‌లో కెమికల్ బాంబ్‌లు ఏ క్షణమైనా పేలే ప్రమాదం పొంచి ఉంది. విశాఖలో ఎల్జీ పాలిమర్స్ తరహాలోనే ప్రగతినగర్‌లోనూ ఇళ్ల మధ్య ఉన్న ఈ ఫ్యాక్టరీలు ప్రజల ఊపిరి తీస్తున్నాయి. రోజూ చీకటి పడే సమయానికి విషవాయువులను నెమ్మదిగా గాలిలోకి వదిలి లక్షల మంది ప్రాణాలకు ముప్పు తెస్తున్నాయి. నిజాంపేట్ కార్పొరేషన్ పరిధిలోని ప్రగతి నగర్‌లో ఎలీప్ ఇండస్ట్రీయల్ ఏరియా ఉంది. ఇప్పుడీ ప్రాంతం అపార్ట్‌మెంట్లు, ఇళ్లతో సందడిగా మారింది. ప్రగతినగర్, నిజాంపేట్ ఏరియాలో దాదాపు లక్షన్నర మంది ప్రజలు జీవిస్తున్నారు. ఎలీప్ ఏరియాలో ఉన్న ఫ్యాక్టరీలు నిబంధనలకు విరుద్ధంగా విషవాయువులను గాలిలోకి వదిలేస్తున్నాయి. ఇవి వదులుతున్న విషవాయువులు అటు గాజులరామారం ఇటు నిజాంపేట, బాచుపల్లి చివర వరకు వ్యాపిస్తున్నాయి. ఈ పరిధిలో ఉండే దాదాపు రెండు లక్షల మంది తీవ్ర ఇబ్బందికి గురవుతున్నారు.

విషవాయువులు పీల్చి తీవ్ర అస్వస్థత..

ఇటీవల ఒక కంపెనీ వదిలిన విషవాయువును పీల్చి పిల్లలు, వృద్ధులు తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. కంపెనీ సమీపంలో ఉండే ఇళ్లల్లోని వారిని ఆరోగ్య సమస్యలు మొదలయ్యాయి. కొందరు వాంతులు చేసుకుంటూ ఆస్పత్రికి వెళ్లాల్సిన పరిస్థితి ఎదురైంది. తలుపులు వేసుకున్నా విషవాయువు ఘాటు తీవ్రంగా వస్తోంది. ఎన్95 మాస్క్‌లు పెట్టుకున్నా ఘాటు వస్తూనే ఉంది. అర్ధరాత్రి వరకు సదరు ఫ్యాక్టరీ విషవాయువును వదులుతూనే ఉంది. ప్రతి రోజూ ఇలా జరుగుతున్నా, స్థానికులు ఫిర్యాదు చేస్తున్నా పొల్యూషన్ కంట్రోల్ బోర్డు అధికారులు మాత్రం ఏ మాత్రం పట్టించుకోవడంలేదు.

కంపెనీ ఎదుట స్థానికుల ధర్నా..

విషవాయువు వదులుతున్న కంపెనీ ఎదుట మహిళలతో సహా స్థానికులు ధర్నా చేశారు. జనం ప్రాణాలు తీయడానికి ప్రయత్నిస్తున్న కంపెనీని మూసేయాలని, మిగిలిన ఫ్యాక్టరీలను అక్కడి నుంచి తరలించాలని డిమాండ్ చేశారు. ప్లకార్డులు పట్టుకుని నినాదాలు చేశారు. పొల్యూషన్ కంట్రోల్ బోర్డు సిబ్బంది వచ్చి గాలిలో నాణ్యత పరిశీలించగా విషవాయువులు ఉన్నట్లు నిర్ధారణ అయింది. అయినా అధికారులు మాత్రం ఇంత వరకు చర్యలు తీసుకోలేదు.

నా పరిధిలో లేదు : ఈఈ రాజేందర్

విషవాయువు వదులుతున్న కంపెనీపై చర్యలు తీసుకునే అధికారం తనకు లేదని పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఈఈ రాజేందర్ చెప్పడం స్థానికులను మరింత ఆందోళనకు గురిచేస్తోంది. పై అధికారులకు సమాచారం ఇస్తానని ఆయన చేతులు దులుపుకుని వెళ్లిపోయారు.

భూమిలోకి ఫ్యాక్టరీ వ్యర్థాలు..

ఎలీప్ ఇండస్ట్రీయల్ ఏరియాలోని ఫ్యాక్టరీలు కెమికల్ వ్యర్థాలను భూమిలోకి పంపిస్తున్నాయి. సరైన డ్రైనేజీ వ్యవస్థ లేకపోవడంతో ఒక ఫ్యాక్టరీ ప్రాంగణం ఏకంగా డ్రైనేజీలా మారిపోయింది. ఇక్కడున్న ప్రతి ఫ్యాక్టరీలోనూ ఇదే పరిస్థితి. కెమికల్ వ్యర్థాలు భూమిలోకి ఇంకడం వల్ల ప్రగతినగర్ ఏరియాలో భూగర్భ జలాలు పూర్తిగా కలుషితమయ్యాయి. చర్య సమస్యలు ఎక్కువయ్యాయి. జుట్టు ఊడిపోవడం, నరాల బలహీనత వంటి ఇతర సమస్యలను స్థానికులు ఎదుర్కొంటున్నారు. ఇప్పటికైనా పొల్యూషన్ కంట్రోల్ బోర్డు అధికారులు ఎలీప్‌లో ఉన్న కెమికల్ ఫ్యాక్టరీలను మూసేయాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

హైదరాబాద్ వార్త

నిధులు మంజూరు చేసి నగరాన్ని రక్షించాలి

- కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి
-ముషీరాబాద్ నియోజకవర్గంలో పలు అభివృద్ధి పనులు ప్రారంభం

ఓపెన్ జిమ్‌కు శంఖుస్థాపన చేస్తున్న కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, ఎమ్మెల్యే ముఠా గోపాల్

ముషీరాబాద్, అక్టోబర్ 26, ప్రభాతవార్త: హైదరాబాద్ నగరంలో డ్రైనేజి వ్యవస్థ అస్థవ్యస్థంగా ఉందని, చిన్నపాటి వర్షానికే డ్రైనేజి వాటర్ ఇండ్లలోకి వచ్చి ప్రజల ఇబ్బదులు పడుతున్నారని తక్షణమే ఉన్నత స్థాయి సమావేశం ఏర్పాటుచేసి, నిధులు మంజూరు చేసి, నగరాన్ని రక్షించాలని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి తెలంగాణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం ముషీరాబాద్ నియోజకవర్గంలోని అడిక్‌మెట్, ముషీరాబాద్ డివిజన్‌లలో పలు అభివృద్ధి పనులను ఆయనస్థానిక ఎమ్మెల్యే ముఠా గోపాల్‌తో కలసి ప్రారంభించారు. అడిక్‌మెట్ డివిజన్‌లోని లలిత నగర్ గ్రేవియార్డ్‌లో అభివృద్ధి పనులు, ముషీరాబాద్ డివిజన్‌లోని పద్మశాలి సంఘం కమ్యూనిటీహాల్‌లో రెండవ అంతస్థు పనులు, బాదం చెట్టు గల్లీలో సీసీ రోడ్డు పనులు అనంతరం మున్సిపల్ వార్డ్ కార్యాలయంలోని వాలీబాల్ ప్లేగ్రౌండ్‌లో ఓపెన్ జిమ్ పనులకు వారు శంఖుస్థాపన చేశారు. ఈ సందర్భంగా కిషన్‌రెడ్డి మాట్లాడుతూ ముషీరాబాద్ నియోజకవర్గంలో కోటీ 35 లక్షలతో అభివృద్ధి పనులు ప్రారంభించటం జరిగిందని తెలిపారు. ప్రపంచంలో అతి వేగంగా అభివృద్ధి చెందుతున్న నగరాలలో హైదరాబాద్ ఒకటని, పారిశ్రామిక రంగం, ఐటీ, ఫార్మా, డిఫెన్స్, హెల్త్ సెక్టార్ లలో హైదరాబాద్ ముందుకు వెళ్తోందని గుర్తు చేశారు. గత కొన్ని రోజులుగా కాంట్రాక్టర్లు బిల్లులు లేక, పనిచేసే కార్మికులకు జీతాలు రాక ఇబ్బందులు పడుతూ ఉండటంతో మంజూరు అయిన పనులకు టెండర్లు పిలిస్తే కాంట్రాక్టర్లు ముందుకు రావటం లేదని అన్నారు. అనేక బస్తీలలో, చుట్టుపక్కల కాలనీలలో ఓపెన్ డ్రైనేజి ఉంది కానీ అండర్ గ్రౌండ్ డ్రైనేజి చేయలేదని గుర్తు చేశారు. ప్రభుత్వం స్పందించి, తక్షణ చర్యలు తీసుకోక పోతే రానున్న రోజుల్లో డ్రైనేజి వ్యవస్త స్థంభించి పోయే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. లక్షా యాభై వేల కోట్లతో మూసి సుందరీకరణ చేస్తానని ముఖ్యమంత్రి పదే పదే చెబుతున్నారు కానీ దానికన్నా ముందు బస్తీలలో డ్రైనేజి సమస్య పరిష్కారం చేయాలని డిమాండ్ చేశారు. మూసీ సుందరీకరణ అవసరమే కానీ, దానికోసం పేద ఇండ్లను తొలగించాల్సిన అవసరం లేదని, పేదల ఇండ్లు తొలగించకుండా మూసీ సుందరీకరణ చేయాలని సూచించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ముషీరాబాద్ నియోజకవర్గంలో అనేక ప్రాంతాలలో నెలకొన్న సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తున్నామని, ఎంతో కాలంగా ముషీరాబాద్ సాగర్‌లాల్ హాస్పటల్ వద్ద ఉన్న డ్రైనేజి సమస్య కూడా త్వరలోనే పరిష్కారం అవుతోందని, పనులు వేగవంతం పూర్తి అవుతున్నాయని తెలిపారు.

ఈ కార్యక్రమంలో ముషీరాబాద్ కార్పోరేటర్ ఎం.సుప్రియా నవీన్‌గౌడ్, బీఆర్ఎస్ యువనేత ముఠా జైసింహ, బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్ష కార్యదర్శులు కొండా శ్రీధర్‌రెడ్డి, ఆకుల అరుణ్, అడిక్‌మెట్ డివిజన్ అధ్యక్షులు శ్రీనివాస్ రెడ్డి, సదానంద్ ముదిరాజ్, ముచ్చకుర్తి ప్రభాకర్, బీజేపీ నాయకులు నవీన్ గౌడ్, రామ్‌రెడ్డి, జీహెచ్ఎంసీ అధికారులు, వాట ర్‌వర్క్స్ అధికారులు పాల్గొన్నారు.

బాల్యవివాహాలు చట్ట విరుద్ధం

-జిహెచ్ఎంసి మేయర్ గద్వాల్ విజయలక్ష్మీ

బాల్యవివాహాలపై రూపొందించిన కరపత్రం ఆవిష్కరిస్తున్న మేయర్ గద్వాల్ విజయలక్ష్మీ

హైదరాబాద్, అక్టోబరు 26,ప్రభాతవార్త: బాల్యవివాహాలు చట్టవిరుద్ధమని ,ఈవివాహాలు బాలికల జీవితాలపై తీవ్రమైన దుష్ప్రభావాలు చూపుతాయని నగర మేయర్ గద్వాల్ విజయలక్ష్మీ అన్నారు. ఈమేరకు శనివారం బాల్యవివాహాలపై అవగాహన కల్పించేందుకు పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ బాల్యవివాహాల వల్ల అమ్మాయిల జీవితాలు నాశనమవడమే గాక సమాజంపై ఆప్రభావం ఉంటుందన్నారు. బాల్యవివాహం చేసుకున్న వారే కాకుండా అలాంటి వివాహాలకు మద్దతు తెలిపిన వారు, పాల్గొన్నవారు శిక్షార్హులు అవుతారన్నారు. బాల్యవివాహంతో పేదరికం, ప్రసూతి మరణాలు, శిశుమరణాలు పెరుగుతాయని అలాగే కుటుంబాల్లో నిరక్షరాస్యత ,హింస మరింత పెరుగుతుందన్నారు. బాల్యవివాహాల్లో పాల్గొన్న తల్లిదండ్రులు ,బంధువులు కూడా చట్ట ప్రకారం శిక్షార్హులుఅవుతారని ,ఈవివాహాలను అడ్డుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని మేయర్ పేర్కొన్నారు.

దళిత క్రిస్టియన్‌లకు ఎస్సీ రిజర్వేషన్ ప్రయోజనాలను వర్తింపచేయాలి

-ఆల్ ఇండియా యునైటెడ్ క్రిస్టియన్ మూవ్‌మెంట్ ఫర్ ఈక్వల్ రైట్స్

కార్యక్రమంలో పాల్గొన్న ఆల్ ఇండియా యునైటెడ్ క్రిస్టియన్ మూవ్‌మెంట్ ఫర్ ఈక్వల్ రైట్స్(ఎఐయసిఎంఈఆర్)

చిక్కడపల్లి, అక్టోబరు 26 ప్రభాతవార్త: క్రైస్తవ మతాన్ని అనుసరిస్తున్న దళిత క్రిస్టియన్‌లకు కూడా ఎస్సీ రిజర్వేషన్ ప్రయోజనాలను ఎలాంటి వివక్ష లేకుండా వర్తింపచేయాలని ఆల్ ఇండియా యునైటెడ్ క్రిస్టియన్ మూవ్‌మెంట్ ఫర్ ఈక్వల్ రైట్స్(ఎఐయసిఎంఈఆర్) ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రత్యేక సమావేశం డిమాండ్ చేసింది. శనివారం నగరంలో ఆలిండియా దళిత క్రిస్టియన్ డిమాండ్ కోరుతూ 'జస్టిస్ కెజి.బాలకృష్ణన్ కమిషన్' అంశంపై సమావేశం నిర్వాహక సంస్థ ప్రధాన కార్యదర్శి గోనె సాల్మన్‌రాజ్ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో ఎఐయుసిఎంఈఆర్ అధ్యక్షుడు బ్రదర్ జోస్ డేనియల్, మంజుసిఎం,యంగ్ క్రిస్టియన్ యూనైటెడ్ ఫెడరేషన్ ఆంధ్రప్రదేశ్ విభాగం అధ్యక్షుడు వరుణ్‌తేజ బృందం తదితరులు పాల్గొన్నారు. ఆర్టికల్ 341లోని పేరా నెంబరు 3ని తొలగించాలని అన్నారు. క్రైస్తవులకు జరుగుతున్న అన్యాయం విషయంలో దేశంలోని అన్ని రాజకీయ పార్టీలతో పాటు కేంద్ర మంత్రులు, వివిధ రాష్ట్రాలకు చెందిన శాసనసభ్యులు, పార్లమెంట్ సభ్యులు తమకు అనుకూలంగా ఉన్నారని అన్నారు. కాని కొందరు కమిషన్‌ను తప్పుదోవ పట్టించే విధంగా ప్రచారాన్ని నిర్వహించడం మంచి సంప్రదాయం కాదని, ఈ విషయంలో దేశంలోని క్రైస్తవ సమాజమంతా ఏకతాటిపై నిలవాలని, ఇటువంటి తప్పుడు వివరణలను తిప్పికొట్టాలని అభిప్రాయపడింది. క్రైస్తవులకు సంబంధించి వారి మనోభావాలకు అనుగుణంగా కమిషన్ నిర్ణయం తీసుకోవాలని పేర్కొన్నారు. జస్టిస్ బాలకృష్ణన్ కమిషన్ నియామకం అవసరమేలేదని, గతంలో జస్టిస్ రంగనాథ్ మిశ్రా కమిషన్ ఇచిన నివేదికను ప్రస్తావించారు. ఈ కార్యక్రమంలో క్రైస్తవ సంస్థల సహకారంతో తెలంగాణ యూనైటెడ్ క్రిస్టియన్ అండ్ పాస్టర్స్ అసోసియేషన్, నేషనల్ దళిత క్రిస్టియన్ బిషప్స్ కౌన్సిల్, ఫెడరేషన్ ఆఫ్ తెలుగు చర్చస్, ఇతర క్రైస్తవ సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

పార్లమెంట్ మతరాజకీయాలకు కేంద్రంగా మారుస్తున్న శక్తులపై పోరాడాలి

టిఎస్‌పిఎస్సీ మాజీ చైర్మన్ ప్రొఫెసర్ గంటా చక్రపాణి

ప్రెస్‌క్లబ్‌లో మాట్లాడుతున్న గంటా చంక్రపాణి, ఈటి నరసింహ తదితరులు

హైదరాబాద్, అక్టోబరు 26,ప్రభాతవార్త: పార్లమెంట్‌ను మత రాజకీయాలకు కేంద్రంగా మారుస్తున్న శక్తులపై పోరాడాల్సిన అవసరం ఉందని టిఎస్‌పిఎస్సీ మాజీ చైర్మన్ ప్రొఫెసర్ గంటా చక్రపాణి అన్నారు. ఈమేరకు శనివారం సిపిఐ హైదరాబాద్ జిల్లా కౌన్సిల్ ఆధ్వర్యంలో సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన హైదరాబాద్ ఇమేజ్‌ని దెబ్బతీసే మతోన్మాద కుట్రలపై ప్రజలను చైతన్య పరుద్దాం అనే అంశంపై రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. దీనికి చక్రపాణి హాజరై మాట్లాడుతూ వందసంవత్సరాల ఈదేశంలో సమసమాజ నిర్మాణం కోసం తన జీవితాన్ని త్యాగం చేసిన భగత్‌సింగ్ మత రాజకీయాలు ఎట్లా జనాలను ప్రభావితం చేస్తాయో ఆమత శక్తులపట్ల అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఎంతో తన రాజకీయ వ్యాసాలు రాశారని గుర్తుచేశారు. నేటి సమాజంలో కూడా మత రాజకీయాలు ప్రజల జీవితాలను ప్రభావితం చేస్తూ అసలు సమస్యలను పక్కదారి పట్టించడంలో ప్రముఖ పాత్ర పోషిస్తున్నాయన్నారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం పనిచేయాల్సిన పార్లమెంట్‌ను నేడు మతోన్మాద శక్తులు మతవిద్వేషాలకు కేంద్రంగా మల్చుకుని పబ్బం గడుపుతున్నాయన్నారు. సిపిఐ తెలంగాణ కార్యవర్గ సభ్యులు ఈటి నర్సింహ్మా మాట్లాడుతూ ఎంఐఎం బిజెపిలు కలిసి మతతత్వ రాజకీయాలు చేస్తూ ప్రజలను బలి చేస్తున్నారన్నారు. ఈరెండు రాజకీయ పార్టీలు తమ వ్యాపారాలను అభివృద్ధి చేసుకుంటూ రాజకీయ ప్రజాప్రతినిధులుగా చలామణి అవుతున్నారని ఇలాంటి వారి కుట్రలను హైదరాబాద్ ప్రజలకు గ్రహించాలన్నారు. ఈకార్యక్రమంలో సిపిఐ సభ్యులు బోస్, ప్రజానాట్యమండలి నర్సింహ, పాశంయాదగిరి, కన్నెగంటి రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

చిల్డ్రన్స్ పార్కు వద్ద నీటిలో గుర్తు తెలియని మృతదేహం

బేగంపేట అక్టోబరు 26,ప్రభాతవార్త

హుస్సేన్ సాగర్ లేక్ చిల్డ్రన్స్ పార్కు సమీపంలో ఓ వ్యక్తి మృతదేహం నీటిలో తేలియాడుతున్న విషయం తెల్సుకున్న సెక్రటేరియట్ పోలీసులు గజ ఈతగాడు శివ సహాయంతో మృత దేహాన్ని బయటకు తీసి గాంధీ ఆస్పత్రి మార్చురీకి తరలించారు. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. ఈ మృతదేహం ఎవరిదీ అనేది తెలియక పోవడంతో గాంధీ మార్చురీలో భద్రపరిచారు. మృతుడుకి సుమారు 40సంవత్సరాల వయసు ఉంటుందని, ఎత్తు 5.6అడుగులు, షర్టు, ప్యాంటు లేవు, జాకీ పూర్తి లోదుస్తులు ధరించి నలుపు రంగు జుట్టు, రెండు చేతులకు పచ్చబొట్లు, ఎడమకాలు చీలమండ మరియూ మెడపై నల్లటి దారం, ఎడమ చేతి మణికట్టు నలుపు ప్లాస్టిక్ వైర్ బ్యాండ్, నీటోషేవ్ చేసుకుని ఉన్నాడని, మృతుని వివరాలు తెల్సిన వారు సెక్రటేరియట్ పోలీస్‌స్టేషన్ లో సంప్రదించాలని పోలీసులు తెలియజేసారు.

పుట్టిన రోజు వేడుకలకు వెళ్లి వచ్చే సరికి ఇంట్లో దొంగతనం

అల్వాల్ అక్టోబరు 26,ప్రభాతవార్త

పుట్టిన రోజు వేడుకలకు వూరెళ్లి వచ్చే సరికి ఇంట్లో దొంగతనం జరిగిన ఘటన అల్వాల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. అల్వాల్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని ప్రేమ్ నగర్ కాలనీ లో నివాసం ఉంటున్న శివరాంప్రసాద్ పుట్టిన రోజు వేడుకలకు ఆంధ్ర ప్రదేశ్‌లోని రాజమండ్రికి కుటుంబంతో సహా వెళ్లాడు. ఈ సమయంలో గుర్తు తెలియని దుండగులు ఇంట్లోకి ప్రవేశించి ఇంట్లో ఉన్న సుమారు రూ 15లక్షలు విలువైన నగలను దొంగిలించుకు పోయారు. ఇంట్లో వస్తువులన్నింటినీ చిందర వందర చేయడంతో పాటు ఇంట్లోని బీరువా లాక్ పగుల గొట్టి బంగారు, వెండి ఆభరణాలను అపహరించుకు పోయారు. పుట్టిన రోజు వేడుకల అనంతరం అల్వాల్ ప్రేమ్ నగర్ కాలనీ ఇంటికి చేరుకున్న బాధితుడు శివరాం ప్రసాద్ ఇంట్లోకి చేరుకుని చూసే సరికి ఇల్లంతా చిందర వందరగా పడిన వస్తువులు, బీరువా పగుల గొట్టి ఉండటాన్ని గమనించాడు. బీరువా లోని నగలు లేకపోవడంతో అల్వాల్ పోలీసులకు ఫిర్యాదు చేసాడన్నారు. అతని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి సీసీ కెమెరాల ఆధారంగా దర్యాప్తు చేస్తున్నట్లు అల్వాల్ పోలీసులు తెలియజేసారు.

తెలంగాణ తల్లి విగ్రహ ఏర్పాటు అభినందనీయం

తెలంగాణ అడ్వకేట్ జెఎసి కన్వీనర్ పులిగారి గోవర్ధన్‌రెడ్డి

తెలంగాణ తల్లి విగ్రహం ఏర్పాటుపట్ల హర్షం వ్యక్తం చేస్తున్న తెలంగాణ ఉద్యమకారులు

ముషీరాబాద్, అక్టోబర్ 26, ప్రభాతవార్త: విద్యుత్ నియంత్రణ భవన్ ఆవరణలో తెలంగాణ తల్లి విగ్రహం ఏర్పాటుచేయటం అభినందనీయమని తెలంగాణ అడ్వకేట్ జేఏసీ కన్వీనర్ పులిగారి గోవర్ధన్‌రెడ్డి కొనియాడారు. శనివారం తెలంగాణ ఉద్యమకారులతో కలసి తెలంగాణ తల్లి విగ్రహానికి పూలమాలలు వేసిన ఆయన టీఎస్ ఎలక్రిసిటీ రెగ్యులేటరీ కమీషన్ ఛైర్మన్ టి.రంగారావును కలసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా గోవర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ ఆనాడు తెలంగాణ రాష్ట్రం కోసం ఎన్నో ఉద్యమాలలో ముందుండి పోరాడిన తెలంగాణ ఉద్యమకారులుగా విద్యుత్ నియంత్రణ భవన్ వద్ద తెలుగుతల్లి విగ్రహం ఏర్పాటు చేయటం పట్ల ఆనందం వ్యక్తం చేస్తున్నామన్నారు. ఈసందర్భంగా ఆనాటి ఉద్యమ చరిత్రను స్మరించుకున్నారు.

విద్యార్థుల ఫీజు రీయంబర్స్‌మెంట్ సమస్యపై పోస్టు కార్డు ఉద్యమం

-బిఆర్ఎస్ నాయకుడు శ్రీను నాయక్

పోస్టుకార్డులతో నిరసన వ్యక్తం చేస్తున్న టీఆర్ఎస్ నాయకులు శ్రీనునాయక్, విధ్యార్థులు

తార్నాక, అక్టోబర్ 26 ప్రభాతవార్త: సీఎం రేవంత్‌రెడ్డి ఎన్నికల ముందు విద్యార్థులకు ఇచ్చిన ఏ ఒక్క హామిని నెరవేర్చలేదని బీఆర్ఎస్ ఒ.యూ విధ్యార్థి నాయకుడు శ్రీను నాయక్ ఆరోపించారు. శనివారం హబ్సిగూడలోని ఒమేగా కాళాశాలలో విద్యార్థులతో ఫీజు రీయంబర్స్ మెంట్ విడుధల చేయాలని కోరుతూ సీఎంకు పోస్టు కార్డులు రాసే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనునాయక్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన ఆరు హామీలతో యువ వికాస్, టెన్త్ ఫాస్ అయిన వారికి రూ.50వేలు, ఇంటర్ ఫాస్ అయిన వారికి లక్ష రూపాయలను, డిగ్రీ విధ్యార్థులకు రెండు లక్షలు, పీహెచ్‌డీ విద్యార్థులకు రూ.ఐదులక్షలు ఇస్తామని మోస పూరిత హామీలను సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చి అధికారంలోకి రాగానే విస్మరించారని ఆరోపించారు. విద్యార్థుల ఫీజు బకాయిలను కూడ చెల్లించలేని దుస్థితిలో కాంగ్రెస్ ప్రభుత్వం ఉందన్నారు. ఫోస్టుకార్డుల ఉద్యమంతోనైనా ప్రభుత్వం దిగిరావాలన్నారు. ఈ కార్యక్రమంలో ఒ.యూ విధ్యార్థి నాయకుడు నవీన్ నాయక్, ప్రవీణ్ నాయక్‌తో పాటు విద్యార్థులు పాల్గొన్నారు.

ధర్మరాజును నేటి తరం ఆదర్శంగా తీసుకోవాలి : గరికిపాటి

గరికిపాటి నరసింహ్మ రావ్ దంపతులను సత్కరిస్తున్న దక్షిణ మధ్య రైల్వే అధికారులు నాగ్య

కంటోన్మెంట్,అక్టోబర్ 26 ప్రభాతవార్త: మహాభారతంలో ధర్మరాజును నేటి తరం ఆదర్శంగా తీసుకొని ప్రతి వ్యక్తి సన్మార్గంలో నడిచి ధర్మాన్ని కాపాడాలని పద్మశ్రీ పురస్కార అవార్డు గ్రహిత ఆధ్యాత్మిక వేత్త డాక్టర్ గరికిపాటి నరసింహ్మారావ్ పిలుపునిచ్చారు. దక్షిణ మధ్య రైల్వే లలిత కళాసమితి ఆధ్వర్యంలో శుక్రవారం రాత్రి సికింద్రాబాద్ రైల్ నిలయం ఆడిటోరియంలో నిర్వహించిన మహాభారతంలో ధర్మరాజు పాత్ర ఔచిత్యం అనే అంశంపై నిర్వహించిన ఆధ్యాత్మిక ప్రవచన కార్యక్రమానికి ముఖ్య అతిధిగా హాజరై ప్రసంగించారు. రాగం భావ యుక్తంగా పధ్యాలు, శ్లోకాలు, గానం చేస్తూ పలువురిని అలరించే విధంగా ప్రవచనాలు చేశారు. ఈ సందర్భంగా 2 గంటల పాటు రైల్ నిలయం ఆడిటోరియం ఆధ్యాత్మిక వాతావరణం సంతరించుకుంది. మహా భారతంలో ధర్మరాజు తన జీవితంలో ఎదుర్కొన్న సమస్యలు, తీరుతెన్నులను విషదీకరించారు. ఈ కార్యక్రమంలో దక్షిణ మధ్య ఐఆర్‌టీఎస్ ప్రిన్సిపాల్ ఛీఫ్ ఆపరేటింగ్ మేనేజర్ బి.నాగ్య, మాజీ జనరల్ మేనేజర్ రామకృష్ణ, రైల్వే లలిత కళా సమితి ఉపాధ్యక్షులు రవి.పి.పాడి, మాజీ అధ్యక్షులు ఎం. భుజరంగరావ్, నాగేశ్వర్ రావ్, కె.పద్మజా, చాన్ భాషా, గోవింద్ తదితరులు పాల్గొన్నారు.

లైలా పూనావాలా ఫౌండేషన్ పేద బాలికలకు సహకారం

సర్టిఫికెట్‌ను అందజేస్తున్న ఫౌండేషన్ సభ్యులు

నిజాంపేట్, అక్టోబర్ 26, ప్రభాతవార్త

విఎన్ఆర్ విజ్ఞాన జ్యోతి ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ వేదికగా పుణే నగరానికి చెందిన ప్రముఖ దార్మిక సంస్థ లైలా పూనావాలా ఫౌండేషన్ ప్రతిభ కలిగిన పేద బాలికల ఇంజనీరింగ్ కోర్సును చదవాలన్న కలను సాకారం చేసేందుకు వారికి స్కాలర్షిప్ రూపంలో 4 సంవత్సరాల కోర్సు రుసుమును అందిస్తుంది. ఈ కార్యక్రమంలో భాగంగా కాలేజ్ క్యాంపస్‌లో నిర్వహించిన కార్యక్రమంలో లైలా పూనావాలా ఫౌండేషన్ చైర్‌పర్సన్ పద్మశ్రీ అవార్డు గ్రహీత లైలా పూనావాలా మాట్లాడుతూ ప్రతిభ కలిగి పేదరికంలో మగ్గుతూ ఇంజనీరింగ్ కోర్సు చదవాలన్న కోరికను సాకారం చేసుకోలేక పోతున్న నిరుపేద బాలికలకు చేయూత అందించడం కోసమే తమ సంస్థ లక్ష్యమని అన్నారు. బాలికలకు ప్రతి సంవత్సరం వారివారి స్థితిగతులను బట్టి స్కాలర్షిప్ రూపంలో ఇంజనీరింగ్ చదువుని ప్రోత్సహిస్తోందన్నారు. ఈ సందర్భంగా హైదరాబాద్ సిటీలో ఎంపిక చేసిన 136 మంది బాలికలకి స్కాలర్షిప్ సిర్టిఫికెట్స్ అందజేశారు. విఎన్ఆర్ విజెఐఈటి ముఖ్యఅతిథిగా డా.సి.డి.నాయుడు మాట్లాడుతూ ఇంటివంటి కార్యక్రమానికి తమ కళాశాల వేదిక కావడం ఆనందంగా ఉందన్నారు. తమ కళాశాల విద్యార్థినులు కూడా ఈ స్కాలర్షిప్ పొందడం ద్వారా తమ ఇంజనీరింగ్ చదువును సాఫీగా కొనసాగిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో లైలా పూనావాలా ఫౌండేషన్ ట్రస్టీ, ఫీరోజ్ పూనావాలా, కళాశాల డైరెక్టర్ ప్రొఫెసర్ బి.చెన్నకేశవరావు, అస్మితపాటిల్, మైక్రోసాఫ్ట్, విజ్ఞానజ్యోతి సిఈఓ డా.సంజయ్ కుమార్, కె.శ్రీనివాస్, విద్యార్థినులు వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ప్రపంచానికి ఔషధాన్ని అందించే గొప్ప చరిత్ర నగరానికి ఉంది

గన్‌ఫౌండ్రి,అక్టోబర్ 26ప్రభాతవార్త: దేశంతోపాటు ప్రపంచానికి ఔషాదాన్ని గొప్ప చరిత్ర హైదరాబాద్ మహానగరానికి ఉందని ఉన్నత మండలి విద్యామండలి మాజీ చైర్మన్ ప్రొఫెసర్ లింబ్రాది అన్నారు. నాంపల్లి ఎగ్జిబిషన్ మైదానంలో సరోజని నాయుడు వనిత ఫార్మాసి మహా విద్యాలయం గ్రాడ్యుయేషన్ దినోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈకార్యక్రమంలో ముఖ్యఅథితిగా ఉన్నత విద్యామండలి మాజీ చైర్మన్ ప్రొఫెసర్ లింబ్రాదితోపాటు ఎగ్జిబిషన్ సోసైటి ఎకానమిక్ కమిటి సభ్యులు,కళాశాల అధ్యాపకులతో పాటు కలిసి గ్రాడ్యుయేషన్ పూర్తి చేసుకున్న ఫార్మాసి విద్యార్థీనులకు పట్టభద్రుల గ్రాడ్యుయేషన్ సర్టిపికెట్లతో పాటు అత్యుత్తమైన ప్రదర్శన కనబర్చిన విద్యార్థులకు బంగారు పథకాలను అందచేశారు. ఫార్మాడి నుండి 42 మంది,ఎంఫార్మా నుండి 27మంది,బి.ఫార్మానుండి 80మంది విద్యార్థీనులు పూర్తి చేసిన విద్యాసంవత్సరానికి పట్టభద్రులయ్యారు. ఈసందర్భంగా ప్రొఫెసన్ లింబ్రాది మాట్లాడుతూ విద్యార్థి దశలో గ్రాడ్యుయేషన్ పూర్తి చేసుకోవడం మంటే ఒక వైలురాయి దాటిన గొప్ప విషయమన్నారు. నాలుగు,ఆరు సంవత్సరాలు చదువు పూర్తి చేసుకుని విజయవంతంగా,బయట ప్రపంచానికి వెళ్తున్న విద్యార్థులకు

ఫార్మాసి పూర్తి చేసిన విద్యార్థీనులకు సర్టిఫికెట్లను అందచేస్తున్న ఉన్నత విద్యామండలి మాజీ చైర్మన్ ప్రొఫెసర్ లింబ్రాది

ప్రత్యేక అభినందనలు తెలిపారు. ఫార్మాసి గొప్ప కోర్సు అని,మానవజీవన విధానంలో మంచి ఆరోగ్యానికి అవసరమై ఔషదాలను తయారు చేసే నూతన జనరేషన్ అందించిన వనితమహావిద్యాలయ ఫార్మాసి అని కొనియాడారు. తెలంగాణ నెంబర్ వన్ ఫార్మాసి కాలేజీ వనిత మహా విద్యాలయంఅని అన్నారు. విద్యార్థుల విజయం వెనుక అధ్యాపకులు,తల్లిదండ్రుల విజయం కృషి ఎంతో ఉందన్నారు. ఈకార్యక్రమంలో సోసైటి ప్రతినిధులు బి.డాక్టర్ ప్రభాశంకర్,బి.హనుమంత్‌రావు, సురేందర్‌రెడ్డి,ఎస్ఎన్‌విపిఎంవి డైరెక్టర్ ఎన్.శ్రీనివాస్, ప్రిన్సిపల్ డాక్టర్ టి.మమత,వైస్ ప్రిన్సిపల్ డాక్టర్.కె. శ్రీరిషలతోపాటు విద్యార్థీనులు పాల్గొన్నారు.

కాలనీలోని సమస్యలపై చర్చించిన ప్రతినిధులు

- త్వరలోనే పరిష్కరిస్తామన్న కౌన్సిలర్ పద్మారావ్

నార్సింగి, అక్టోబర్ 26 ప్రభాతవార్త : మణికొండ మున్సిపాలిటీ పరిధిలోని పలు కాలనీలలో నెలకొన్న సమస్యలపై శనివారం వెంకటేశ్వర కాలనీలో స్థానిక కౌన్సిలర్, ది సిటిజెన్స్ కౌన్సిల్ ప్రతినిధులు చర్చించారు. వీధి దీపాలు సరిగ్గా వెలుగడం లేదని, దోమలు, వీధి కుక్కల బెడద తీవ్ర రూపం దాల్చిందని, వాహన దారుల మితిమీరిన వేగానికి కళ్లెం వేసేలా స్పీడ్ బ్రేకర్లు వేయాలని, పిచ్చి మొక్కలు తొలగించాలని, రోడ్లపై ఏర్పడిన గోతలకు మరమ్మత్తులు చేయించాలని, పార్కుల నిర్వాహణ తదితర అంశాలపై పలు కాలనీ వాసుల ప్రతినిధులు, స్థానిక కౌన్సిలర్ పద్మారావ్‌కు సూచించారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ బిట్లు పద్మారావ్ మాట్లాడుతూ ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు ఎల్లప్పుడు సిద్ధంగా ఉన్నానని తెలిపారు. వెంకటేశ్వర కాలనీలో సీసీ రోడ్లు, వీధి దీపాలు, మంచినీరు, భూగర్భ డ్రైనేజి, పార్కులు వంటివి ఏర్పాటు చేయించానన్నారు. మున్సిపల్ పార్కులో ఏర్పడిన కొన్ని సమస్యలను వెంటనే పరిష్కరించి, కాలనీ వాసులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా మున్సిపల్ తరపున

మణికొండ మున్సిపాలిటీ పరిధిలోని వెంకటేశ్వరకాలనీలో పార్కులోని సమస్యలపై చర్చిస్తున్న కౌన్సిలర్, ది సిటిజెన్స్ కౌన్సిల్ ప్రతినిధులు.

అన్ని చర్యలు తీసుకుంటామన్నారు. ఎన్నికల సమయంలో నాకు అండగా నిలిచిన కాలనీ వాసుల సమస్యలు పరిష్కరించి, అభివృద్ధి పనులు చేయించడం నా విధి అని పేర్కొన్నారు. కౌన్సిలర్ స్పందన పట్ల కాలనీ వాసులంతా ఆనందం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ది సిటిజెన్స్ కౌన్సిల్ ఉపాధ్యక్షులు అందె లక్ష్మణ్‌రావ్, ప్రధాన కార్యదర్శి సయ్యద్ ఆరిఫ్ మహ్మద్, ఉపాధ్యక్షులు ఉపేంద్రనాథ్‌రెడ్డి, ప్రతినిధులు శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

విశ్వహిందూ రక్ష పరిషత్ జాతీయ అధ్యక్షురాలుగా యమునా పాఠక్

హైదరాబాద్, అక్టోబరు 26,ప్రభావార్త: పార్టీలకు అతీతంగా హిందువులందరికీ ఐక్యం చేసి సమస్యల పరిష్కారం కోసం అవిర్భవించిన విశ్వహిందూ రక్ష పరిషత్ జాతీయ మహిళా విభాగం అధ్యక్షురాలుగా ప్రముఖ సామాజిక ఉద్యమకారిణి యమున పాఠక్ నియమితులయ్యారు. ఈమేరకు సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో జాతీయ అధ్యక్షులు గోపాల్‌రాయ్ ఆమెకు నియామకపత్రం అందజేశారు. అలాగే రాష్ట్ర కమిటీని నియమించి వారికి నియామకపత్రాలు అందజేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ దేశంలో మెజార్టీ ప్రజలైన హిందువులు, హిందూదేవత మూర్తులపై దాడులు జరగడం విచారకరమన్నారు. తమసంస్థ ఆధ్వర్యంలో హిందువుల పరిరక్షణకు కృషి చేస్తామని చెప్పారు. హిందువులు ఎదుర్కొంటున్న తీవ్రమైన వివక్ష మరిముఖ్యంగా దక్షిణ ఆసియా ఖండంలో ఎంతో చేదుఅనుభవాలు చవిచూస్తున్న హిందూల దుస్థితిని ఉద్దేశించి వారిపై జరుగుతున్న దమనకాండ అన్ని విధాలుగా అరికట్టేందుకు తమ సంస్థ నడుం బిగించిందన్నారు. అఖిలభారత జాతీయ సంస్థ ఆర్గనైజర్ చెరువు రాంబాబు మాట్లాడుతూ హిందూ సంబంధిత అన్ని అనుబంధ సంస్థలు అటు ఆర్ఎస్ఎస్, విహెచ్‌పి

యమునా పాఠక్‌కు నియామకపత్రం అందజేస్తున్న గోపాల్‌రయ్ తదితరులు

,బిజెపి, హిందూ భావజాలం ఉన్న ఏసంస్థతో అయినా సంఘటితమై కలిసికట్టుగా నిబద్ధతతో ఐక్యమత్యంతో పనిచేస్తామని వారు పేర్కొన్నారు. గడపలోపల కులము ..గడప బయట హిందువులం అనే నినాదంతో ఈసంస్థ ముందుకువెళ్తుందని ప్రతికాలనీ, బస్తీ, గేటెడ్ కమ్యూనిటీలతో సహా హిందూ జేఏసీ ఏర్పరచడమే లక్ష్యంగా పనిచేస్తామని పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో యాక్టర్ వైభవ్ సూర్య, దయానంద్, భవాని, విజయలక్ష్మి, అడ్వకేట్ పార్వతి, అశ్విని ఆనంద్, కమల తదితరులు పాల్గొన్నారు.

మహిళలకు రొమ్ము క్యాన్సర్‌పై అవగాహన తప్పనిసరి

హైదరాబాద్, అక్టోబరు 26,ప్రభాతవార్త: మారుతున్న జీవనశైలి, ఒత్తిడి తరత్రా కారణాల వల్ల మహిళలు ఎన్నో అనారోగ్య సమస్యలను ఎదుర్కొంటున్నారని ఇటీవల రొమ్ము క్యాన్సర్ కేసులు ఎక్కువగా కనిపిస్తున్నాయని చిన్న,పెద్ద అనేబేధం లేకుండా అన్ని వయస్సులో వారిలో బయటపడుతుందని కావున రొమ్ము కాన్సర్‌పై ప్రతిఒక్కరూ అవగాహాన కలిగి ఉండాల్సిన అవసరం ఉందని హైకోర్టు జడ్జి సురేపల్లి నందా అన్నారు. ప్రపంచ రొమ్ము క్యాన్సర్ అవగాహాన మాసం పురసనకరించుకుని రెనోవా సెంచరీ ఆసుపత్రి ఆధ్వర్యంలో బంజారాహిల్స్‌లో ఏర్పాటు చేసిన పింక్ వాక్‌ను ఆమె ప్రారంభించారు. ఈసందర్భంగా జస్టిస్ నందా మాట్లాడుతూ ప్రంపంచవ్యాప్తంగా ప్రతిసంవత్సరం 2.3 మిలియన్ల కొత్తకేసులతో రొమ్ము క్యాన్సర్ ప్రబలుతుందన్నారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ డబ్ల్యూహెచ్‌వో గ్లోబల్ బ్రెస్ట్ క్యాన్సర్ ఇనిషియేటివ్‌ని ప్రారంభించిందని 2040 నాటికి మరణాలు రేటు సంవత్సరానికి 2.5శాతం తగ్గించి 2.5మిలియన్ల ప్రాణాలను కాపాడేందుకు కృషిచేస్తుందన్నారు. వ్యాధిని ముందస్తుగా గుర్తించడం ,సకాలంలో రోగ నిర్ధారణ చేయడం, అవగాహాన కల్పించడంపై ముమ్మరంగా పనిచేస్తుందన్నారు. క్రమం తప్పకుండా వ్యాయామం, సరైన జీవనశైలి కలిగి ఉండటం, ధూమపానం, అల్కహాల్‌వంటి వాటికి దూరంగా ఉండాలని సూచించారు. సివోవో రవీంధ్రనాథ్, అంకాలజి డాక్టర్ శ్రీనివాస్ జూలూరి మాట్లాడుతూ రొమ్ముక్యాన్సర్‌ను తొలిదశలోనే గుర్తిస్తే చాలా ప్రాణాలను కాపాడుకోవచ్చుని ఇందుకు ఎవరికి వారు స్వయంగా పరీక్షించుకోవడం ముఖ్యమన్నారు. ఈకార్యక్రమంలో డాక్టర్ కె.శ్రీనివాస్‌రావు, ఉదయ్ కుమార్, డాఆశ్విన్ పండిట్, డా.నిషిత్ వడ్డెబోయిన, డా.జ్యోతి జోన్నాదుల లతోపాటు వైద్యులు, వైద్యేతర సిబ్బంది పాల్గొన్నారు.

పింక్‌వాక్‌లో పాల్గొన్న జస్టిస్ నందా తదితరులు

హైడ్రా చర్యలు భవిష్యత్ తరాలకు ఉపయోగం

-బిసి విద్యార్థి సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రవికుమార్ యాదవ్

సమావేశంలో మాట్లాడతున్న రవి కుమార్ యాదవ్ తదితరులు

హైదరాబాద్, అక్టోబరు 26,ప్రభాతవార్త: హైడ్రా చట్ట వ్యతిరేక చర్యల కాదని నగరంలో భవిష్యత్ తరానికి ఎంతో ఉపయోగడపతుందని హైడ్రాపై సిఎం రేవంత్‌రెడ్డి నిర్ణయం హర్షించదగ్గదని బిసి విద్యార్థి సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రవికుమార్ యాదవ్ అన్నారు. ఈమేరకు శనివారం బిసిభవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ హైదరాబాద్ నగరంలో కొన్నేళ్ల కిందట వరకు చెరువులు అటవీ ప్రాంతాలతో పచ్చగా కనిపించేవని ఇప్పుడు నగరంలో జనభా ఊహించని విధంగా పెరగడం, మనిషి స్వార్థం పెరగడంతో ఆప్రాంతాలన్నీ కనుమరుగయ్యాయన్నారు. చెరవులు, ప్రభుత్వ భూములను కబ్జాలు చేసి అనేకమంది అక్రమకట్టడాలు నిర్మించారన్నారు. ఇలాంటి చర్యలవల్ల నాలాలు, డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్థంగా తయారుకావడంతోపాటు వర్షాలు వస్తే రోడ్లపై నీళ్లు నిలిచి ట్రాఫిక్ రద్దీ ఏర్పడుతుందన్నారు. ఇదిఇలానే కొనసాగితే భవిష్యత్‌లో మరింత సమస్య ఏర్పడుతుందన్నారు. విశ్వనగరంగా ఎదుగుతున్న హైదరాబాద్‌కు అలాంటి సమస్య రాకకుండా సిఎం రేవంత్‌రెడ్డి ముందుగానే గుర్తించి హైడ్రా ద్వారా అక్రమకట్టడాలను తొలగించే ప్రయత్నం చేస్తున్నారని భవిష్యత్ తరాలు అభివృద్ధి చెందాలంటే హైడ్రాచర్యలను ప్రజలకు స్వాగతించాలని కోరారు. ఈకార్యక్రమంలో విద్యార్థి నాయకులు ప్రభాకర్‌రెడ్డి, బాలస్వామి, వీరన్న, వెంకన్నగౌడ్, వంశీ, మహేష్, రజియా తదితరులు పాల్గొన్నారు.

చార్మినార్ భాగ్యలక్ష్మీ మందిరంలో 29 నుంచి దీపావళి మహోత్సవాలు

చార్మినార్,అక్టోబరు 26 ప్రభాతవార్త : చార్మినార్ శ్రీ భాగ్యలక్ష్మీ మందిరంలో మూడు రోజుల పాటు దీపావళి మహోత్సవాలను అత్యంత వైభవంగా నిర్వహించనున్నామని మందిరం కమిటి ట్రస్టీ శశికళ వెల్లడించారు. ప్రతీ సంవత్సరం భాగ్యలక్ష్మీ మందిరంలో ఘనంగా దీపావళీ వేడుకలు జరుగుతాయి. దీపావళీ మహోత్సవాలలో నగరంలోని పలు ప్రాంతాలకు చెందిన లక్షలాది మంది భక్తులు అమ్మ వారికి ప్రత్యేక పూజలు నిర్వహించి ఆశీస్సులు పొందుతారు. దీపావళీ మహోత్సవాలకు మరో రెండు రోజులు మాత్రమే ఉన్నందున చార్మినార్ శ్రీ భాగ్యలక్ష్మీ మందిరాన్ని అందంగా తీర్చి దిద్దారు. మందిరంలో జరగనున్న దీపావళీ మహోత్సవాలలో పాల్గొనాలని కోరుతూ తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు బట్టి విక్రమార్క,మాజీ ఎంపి అంజన్ కుమార్ యాదవ్,దక్షిణ మండలం డిసిపిస్నేహ మెహ్రాలకు దీపావళీ మహోత్సవాలకు సంబంధించిన ఆహ్వాన పత్రికలు అందజేశామని శశికళ తెలిపారు. అక్టోబరు నెల 29వ తేదీన ధంతేరస్,30వ తేదీన నరక చతుర్ధశి (చిన్న దీపావళి),31వ తేదీన దీపావళి పండుగను మందిరంలో జరుపుకోన్నామని,దీపావళీ రోజు సాయంత్రం నుంచి భక్తులకు అమ్మ వారిఖజానా పంపిణీ చేయనున్నామని ఆమె తెలియజేశారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండ అన్ని ఏర్పాట్లు చేశామని శశికళ తెలిపారు. కాగా దీపావళీపండుగ సందర్భంగా పాతబస్తీలో పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేయనున్నామని చార్మినార్ ఇన్‌స్పెక్టర్ చంద్రశేఖర్ తెలిపారు. దీపావళీ పండుగ సందర్భంగా గుల్జారాహౌస్, చార్కమాన్, కోకరివాడి, షక్కర్‌కోట, ఘాన్సీ బజార్, ఝూలా, బేగంబజార్ ప్రాంతాలలోని మార్కెట్లు కొనుగోలుదారులతో రద్దీగా ఉంటున్నాయి.

జిహెచ్ఎంసి కమిషనర్ ఇలంబర్తికి దీపావళీ మహోత్సవాల ఆహ్వాన పత్రిక అందజేస్తున్న చార్మినార్ శ్రీ భాగ్యలక్షీనమందిరం ట్రస్టీ శశికళ

వర్షాలకు పాడైన రోడ్డును ఆధునీకరించాలని వినతి

బండ్లగూడ కార్పోరేషన్ ప్రశాంత్‌నగర్ కాలనీలో వర్షాలకు పాడైన రోడ్డును మళ్లీ నిర్మించాలని కోరుతూ ఎమ్మెల్యేకు వినతిపత్రం ఇస్తున్న కాలనీ వాసులు

నార్సింగి, అక్టోబర్ 26 ప్రభాతవార్త : బండ్లగూడ జాగీర్ కార్పోరేషన్ పరిధిలోని ప్రశాంత్‌నగర్ కాలనీలో ఇటీవల కురిసిన వర్షాల కారణంగా రోడ్లు పాడైపోయాయని, వాటిని తిరిగి నిర్మించాలని కోరుతూ శనివారం రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్‌కు ప్రశాంత్‌నగర్ కాలనీ వాసులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కాలనీ ప్రతినిధి సత్య ఎల్లెంకి మాట్లాడుతూ ప్రశాంత్‌నగర్ కాలనీలోని విజయ లక్ష్మీ గణపతి దేవాలయంకు నిత్యం వందలాది మంది భక్తులు వస్తుంటారని, ఈ ఆలయం ముందున్న రోడ్డంతా వర్షాలకు ధ్వంసం అయ్యిందని, దీంతో భక్తులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. భక్తులు, స్థానిక ప్రజల రాకపోకలకు తీవ్ర ఇబ్బందిగా మారిన గోతులమయమైన రోడ్డును ఆధునీకరించాలని ఎమ్మెల్యేను కోరామని పేర్కొన్నారు. వీరి వినతిపత్రం అందుకున్న ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ మాట్లాడుతూ నేనున్నదే ప్రజల ఇబ్బందులను దూరం చేసేందుకని, వీలైనంత త్వరగా సంబంధిత శాఖ అధికారులను పిలిపించి పాడైపోయిన రోడ్డు ఆధునీకరణకు ఎన్ని నిధులు కావాలో? ఎస్టిమేట్ వేయించి పనులు ప్రారంభిస్తామని హామీనిచ్చారు. ఎమ్మెల్యే స్పందన పట్ల కాలనీ వాసులు సంతోషంను వ్యక్తం చేశారు. ప్రజల సమస్యల పట్ల ఇంత వేగంగా స్పందిస్తున్నందుకే వరుసగా నాలుగుమార్లు ప్రకాశ్‌గౌడ్ ఎమ్మెల్యేగా ఎంపికవుతున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్పోరేటర్ సాగర్‌గౌడ్, పాల్గొన్నారు.

స్విమ్మింగ్ పోటీల విజేతకు ఘన సన్మానం

నార్సింగి, అక్టోబర్ 26 ప్రభాతవార్త : తెలంగాణ రాష్ట్రస్థాయి స్విమ్మింగ్ పోటీలలో మణికొండ మున్సిపల్ వెంకటేశ్వర కాలనీకి చెందిన మహ్మద్ యూనుస్ ఒక స్వర్ణ, రెండు రజత పతకాన్ని సాధించి నిర్వాహకులతో శభాష్ అనిపించుకున్నాడు. 100. మీటర్ల విభాగంలో స్వరం, 200,400.మీటర్ల విభాగంలో రెండు రజత పతకాలు సాధించాడు. ఇతడిని వెంకటేశ్వర కాలనీ ప్రజలు, స్థానిక కౌన్సిలర్ పద్మారావ్‌లు ఘనంగా సత్కరించారు. అనంతరం పద్మారావ్ మాట్లాడుతూ మన ప్రాంతానికి చెందిన యువకుడు రాష్ట్రస్థాయి స్విమ్మింగ్ పోటీలలో రాణించి బంగారు పతకం సాధించడం గర్వంగా ఉందన్నారు. ఇతడిని చూసి యువత స్ఫూర్తి పొందుతారని, చదువులతో పాటు ఆటలకు కూడా నేడు మంచి డిమాండ్ ఉందని, తల్లిదండ్రులు తమ బిడ్డలను ఆటల్లో కూడా ప్రోత్సహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

గండిపేట కాండ్యూట్‌కు మరమ్మతులు

నార్సింగి, అక్టోబర్ 26 ప్రభాతవార్త : గండిపేట జలాశయం నుంచి హైదరాబాద్ నగరానికి ఎలాంటి మోటార్లు వాడకుండానే, కేవలం గ్రావిటీ ద్వారా నీటిని సరఫరా చేసే కాండ్యూట్ నుంచి గత దశాబ్ద కాలంగా లీకేజీల కారణంగా పెద్దమొత్తంలో నీరు వృధాగా పారేది. గండిపేట్, కోకాపేట్, మణికొండ, పుప్పాలగూడ, షేక్‌పేట్ ప్రాంతాలలో ఈ లీకేజీలు అధికంగా ఉండేవి. అప్పుడప్పుడు లీకేజీలకు మరమ్మత్తులు చేయించినా త్వరగానే మళ్లీ లీకేజీలు అయ్యేవి. దీంతో అధికారులు కొత్త టెక్నాలజీతో కాండ్యూట్‌కు మరమ్మత్తులు చేసేందుకు శ్రీకారం చుట్టారు. జలాశయం నుంచి నగరానికి నీరు సరఫరా అవుతుండగానే కాండ్యూట్‌కు మరమ్మత్తులు చేయడం ప్రారంభించారు. ఈ పనులను జల మండలి ఎండి అశోక్‌రెడ్డి దగ్గరుండి పర్యావేక్షించారు. జర్మన్ టెక్నాలజీతో నీటి సరఫరాకు ఎలాంటి అంతరాయం కలుగకుండానే లీకేజీలకు మరమ్మత్తులు చేయవచ్చని, అది మేము చేసి చూపిస్తామని చెన్నై కంపనీ ముందుకు వచ్చింది. 40.రోజుల క్రితం ఆసిఫ్‌నగర్ ఫిల్టర్‌బెడ్ వద్ద ఉన్న కాండూట్‌కి 10.మీటర్ల దూరం నూతన టెక్నాలజీ ద్వారానే మరమ్మత్తులు చేశారు. ఇది విజయవంతం కావడంతో ఇదే తరహాలో కాండ్యూట్ మొత్తం మరమ్మత్తు చేయాలని జల మండలి అధికారులు పనులు ప్రారంభించారు. ఈ పద్ధతి ద్వారా లీకేజీల సమస్య శాశ్వతంగా పరిష్కారం అయితే నీటి వృధా అరికట్టబడుతుందని అధికారులు పేర్కొంటున్నారు.

యాదవులు సామాజిక రంగాల్లో రాణించాలి

బోయిని వెంకటేష్‌యాదవ్‌ను సన్మానించిన యాదవ ప్రముఖులు కార్పొరేటర్ జి.శంకర్‌యాదవ్,బిజెపి గొల్కొండ జిల్లా అధ్యక్షులు వి.పాండుయాదవ్‌లు

అఫ్జల్‌గంజ్,అక్టోబర్ 26ప్రభాతవార్త: యాదవులు సామాజిక రంగాల్లో రాణించాల్సిన అవసరం ఎంతైనా ఉందనిగ్రేటర్ హైదరాబాద్ యాదవ్ మహాసభ అధ్యక్షులు బోయిని వెంకటేష్ యాదవ్ అన్నారు. జాంబాగ్ యాదవ సంఘంలో ఏ

గ్రేవ్ యార్డులో మౌలిక సదుపాయాలు మెరుగుపర్చాలి : ఎమ్మెల్యే తలసాని

అధికారులతో సమావేశమైన ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ తదితరులు

కంటోన్మెంట్,అక్టోబర్ 26 ప్రభాతవార్త: దీపావళి పర్వదినాన్ని పురస్కరించుకొని ఆల్ సోల్స్ డే (పవిత్ర ఆత్మల దినం)కు స్మశాన వాటికల్లో అన్ని ఏర్పాట్లు చేయాలని మాజీ మంత్రి, సనత్ నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ అధికారులను ఆదేశించారు. శనివారం మారేడ్‌పల్లిలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో వివిధ విభాగాల అధికారులతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా తలసాని మాట్లాడుతూ ఆల్ సోల్స్ డే సందర్భంగా హిందూ స్మశాన వాటికల గ్రేవ్ యార్డులకు వేలాది మంది వస్తారని, వారికి ఎలాంటి అసౌకర్యాలు కలుగకుండా తగు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతి సంవత్సరం మాదిరిగానే గ్రేవ్ యార్డుల వద్ద పెయింటింగ్ వేయడం, శుభ్రపర్చడం లైటింగ్ ఏర్పాటు, చెత్త వ్యర్థాలను తొలగించేందుకు తగు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో బన్సీలాల్‌పేట్ కార్పోరేటర్ కురుమ హేమలత, లష్కర్ జిల్లా సాధన సమితి అధ్యక్షుడు గుర్రం పవన్ కుమార్ గౌడ్, ఇంజనీర్లు సుదర్శన్, మోహన్, భరత్, ధర్మారెడ్డి, జయరాజు, బిఆర్ఎస్ నాయకులు వెంకటేశన్‌రాజు, ఏసూరి మహేశ్,శ్రీకాంత్ రెడ్డి,లక్ష్మిపతి, రమణ, సురేశ్ తదితరులు పాల్గొన్నారు.

వీధి వ్యాపారులకు భరోసా కల్పించాలి : జెట్టి విజ్ఞప్తి

కంటోన్మెంట్ సిఈఓ మధుకర్ నాయక్‌కు విజ్ఞప్తి చేస్తున్న బిజెపి నేత జెట్టి ఉమేశ్వర్ రావ్ తదితరులు

కంటోన్మెంట్,అక్టోబర్ 26 ప్రభాతవార్త: కేంద్ర ప్రభుత్వ అధీనంలో ఉన్న కంటోన్మెంట్ బోర్డు పరిధిలోని చిరు వ్యాపారులకు, స్ట్రీట్ వెండర్స్‌కు 2014 నిబంధనల ప్రకారం వారి సమస్యలను పరిష్కరించాలని ప్రముఖ సామాజిక వేత్త, బిజెపి సీనియర్ నాయకుడు జెట్టీ ఉమేశ్వర్ రావ్,కంటోన్మెంట్ బోర్డు సిఈఓ మధుకర్ నాయక్‌కు విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా జెట్టీ మాట్లాడుతూ చిరు వ్యాపారులపై బోర్డు అధికారులు ఇబ్బందులకు గురి చేయకుండా చిరువ్యాపారులను తమ కార్యకలాపాలను సాఫీగా జరుపుకునే విధంగా చూడాలన్నారు. చిరు వ్యాపారులకు, స్ట్రీట్ వెండర్స్‌కు భరోసా కల్పించాలని విజ్ఞప్తి చేశారు. అదే విధంగా కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఆత్మ నిర్భర్, మెప్మా పథకాలు అమలైయ్యే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు.

నియోజకవర్గంలో భూ రిజిస్ట్రేషన్ సమస్యలను పరిష్కారం చేయాలని కోరిన శ్రీశైలంగౌడ్

మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డిని సన్మానిస్తున్న శ్రీశైలంగౌడ్

జీడిమెట్ల, అక్టోబర్ 26, ప్రభాతవార్త

కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధిలో కొన్ని కాలనీల్లో వక్ఫ్ బోర్డ్ స్థలాల నెపం చూపిస్తూ, సర్వే నెంబర్ 58 నుండి 226 వరకు ఎలాంటి రిజిస్ట్రేషన్‌లు చేయకుండా సబ్ రిజిస్ట్రార్ నిలిపివేయడంతో, దానిని పునరుద్ధరించాలని కోరుతూ శనివారం మినిస్టర్ క్వార్టర్స్‌లో రెవిన్యూ శాఖామంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిని మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్ వినతిపత్రం అందజేశారు. అనుమతులతో పాటు సంబంధిత పత్రాలు సక్రమంగా ఉన్నా, రిజిస్ట్రేషన్లు నిలిపివేయడం పట్ల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని మంత్రికి శ్రీశైలంగౌడ్ వివరించారు. ఈ సమస్యపై స్పందించిన మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి రెవిన్యూ శాఖ ముఖ్య కార్యదర్శి నవీన్ మిట్టల్‌కి ఆదేశాలు జారీ చేశారు. యథాతథంగా రిజిస్ట్రేషన్లు అయ్యేందుకు కృషి చేస్తానని మంత్రి హామీ ఇచ్చినట్లు శ్రీశైలం గౌడ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో దుర్గారావు, అప్పారావు, వెంకటరమణయ్య, ఓబుల్‌రెడ్డి, సత్యం, హర్షారెడ్డి, రాజేష్, రాజీవ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలను పరిష్కరించే నాయకుడు ఎమ్మెల్యే వివేకానంద

ఎమ్మెల్యేకు సమస్యలు తెలుపుతున్న స్థానికులు

జీడిమెట్ల, అక్టోబర్ 26, ప్రభాతవార్త

ప్రతి రోజు రెండు వందల నుండి మూడు వందల వరకు ప్రజలు తమ సమస్యలను విన్నవించుకోవడానికి ఎమ్మెల్యే కెపి వివేకానందని కలవడానికి వస్తుంటారు. ఓర్పుతో మొదటి వ్యక్తి నుండి చివరి మనషి వరకు సమస్యలు వినడం, పరిష్కరించడం ఎమ్మెల్యే నైజం.. ఎమ్మెల్యే కెపి వివేకానంద వారి సమస్యలను ఓర్పుగా విని సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడి సమస్యలను పరిష్కరించాలని సూచనలు చేస్తుంటారు. ఎంతో దూరం నుండి వచ్చిన మా సమస్యను వినడమే కాకుండా సమస్య పరిష్కారం కోసం చొరవ చూపడం చాలా ఆనందంగా ఉందని బాధితులు తమ సంతోషాన్ని వ్యక్తం చేస్తున్నారు.

హిందూ స్మశాన వాటికలను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దాలి : లింగాని

తుకారాంగేట్‌ల స్మశాన వాటికను పరిశీలిస్తున్న బిఆర్ఎస్ నేతలు లింగాని శ్రీనివాస్, నక్క మధు తదితరులు

అడ్డగుట్ట,అక్టోబర్ 26 ప్రభాతవార్త: దీపావళి పర్వదినం సందర్భంగా స్మశాన వాటికల్లో సమాదుల వద్ద పూజలు చేసేందుకు వచ్చే వారి కోసం స్మశాన వాటికల్లో ప్రత్యేక ఏర్పాట్లను చేయాలని జిహెచ్ఎంసి అధికారులకు బిఆర్ఎస్ నేతలు లింగాని శ్రీనివాస్, నక్క మధులు విజ్ఞప్తి చేశారు. శనివరం తుకారాంగేట్ లోని వడ్డెర కులానికి చెందిన స్మశాన వాటికను వారు సందర్శించారు. చుట్టుప్రక్కల పేరుకు పోయిన పిచ్చి మొక్కలను, చెత్తా, చెదారాన్ని తొలగించాలని జిహెచ్ఎంసి ఇంజనీర్లకు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నాకులు వడ్డెర ఎల్లయ్య, పొన్నాల రాజు, దసరా శ్రీనివాస్, మహేశ్, మహేందర్, సంతోష్, శంకర్, రాజు తదితరులు పాల్గొన్నారు.

బాలాజీనగర్ కాలనీ సమస్యలు పరిష్కరించాలని వినతి

పోలీసులకు బాలాజీనగర్ సమస్యలను వివరిస్తున్న స్థానికులు.

మెహిదీపట్నం, అక్టోబర్ 26, ప్రభాతవార్త : బాలీజీనగర్ కాలనీ చుట్టుపక్కల ఫంక్షన్‌హాల్‌లతో పాటు గుడి మల్కాపూర్ కూరగాయల, పూల మార్కెట్‌లు ఉండడంతో అనేక సమస్యలు ఎదురవుతున్నాయని, స్థానిక ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ శనివారం కుల్సుంపుర ఏసీపీ మహ్మద్ మునావర్, గుడిమ ల్కాపూర్ పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్ బైరి రాజులకు కాలనీ అధ్యక్షులు అడికి మల్లిఖార్జున్ ఆధ్వర్యంలో పలు సమస్య లతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. ఈసందర్భంగా అడికి మల్లిఖార్జున్ మాట్లాడుతూ.. కాలనీ చుట్టుపక్కల ఉన్నటువంటి ఫంక్షన్‌హాల్‌లలో నిత్యం సౌండ్ పొల్యూ షన్‌తో పాటు పటాకుల సౌండ్, డ్రోన్ కెమెరాల సమస్యలు నిత్య కృత్యంగా మారాయన్నారు. దీంతో కాలనీ వాసులందరు నిద్రలేని రాత్రులు గడపాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. పక్కనే ఉన్నటువంటి గుడిమల్కాపూర్ కూరగాయల, పూలమార్కెట్‌తో నిత్యం రహదారులన్ని రద్దీగా మారడంతో ట్రాఫిక్ సమస్యలు ఎదరువుతున్నాయన్నారు. పండుగల సమయంలో మార్కెట్ రహదారి మొత్తం వాహనాలతో నిండిపోవడంతో కాలనీ నుంచి బయటకు వెల్లలేని పరిస్థితులు నెలకొంటున్నాయన్నారు. ఇట్టి సమస్యలపై ప్రత్యేక దష్టి సారించి పరిష్కరిస్తామని ఏసీపీ హామీ ఇవ్వడం జరిగిందన్నారు. అనంతరం నల్లపోచమ్మ దేవాలయ చైర్మన్ వై.అనీల్‌చారి ఏసీపీ మహ్మద్ మునావర్, ఇన్‌స్పెక్టర్ బైరి రాజులకు శాలువాకప్పి పుష్పగుచ్చం అందజేశారు. వినతిపత్రం అందించిన వారిలో కాలనీ ప్రధాన కార్యదర్శి సామ సురేందర్‌రెడ్డి సభ్యులు మాధవరెడ్డి, బలవంతరెడ్డి, మామిడి వెంకటేష్, వెంకటరమణ, ఏకంబర్నాథ్, ముఖీద్ తదితరులున్నారు.

శోభాయమానంగా ఆంధ్రనాట్య నృత్యవిన్యాసాలు

జ్యోతిప్రకాసనంచేసి నృత్యపోటీ ప్రదర్శనలను ప్రారంభిస్తున్న కళాకృష్ణ, ఉమామహేశ్వరి, పద్మమోహన్, రాధిక, అనుపమ, నవత తదితర గురువులు

నాంపల్లి, అక్టోబరు 26 ప్రభాతవార్త : విశ్వవిఖ్యాత భారత కళాప్రపూర్ణ పద్మశ్రీ డా. నటరాజ రామకృష్ణ పునరుద్ధరణ చేసిన ఆంధ్రనాట్యం అభివృద్ధి ప్రోత్సహంలో భాగంగా ప్రముఖ సాంస్కృతిక సంస్థ స్వరనర్తన అకాడమీ, హైదరాబాద్ వ్యవస్థాపకురాలు దెందులూరి పద్మామోహన్ ప్రముఖ నాట్యాచార్యులు గురు కళాకృష్ణ పర్యవేక్షణలో శనివారం ఉదయం నాంపల్లి పబ్లిక్ గార్డెన్స్ వద్దనున్న పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయంలోని డా. నందమూరి తారక రామారావు కళామందిరంలో ప్రముఖ ఆంధ్రనాట్యాచార్యుడు కేంద్రసంగీత నాటకఅకాడమీ పురస్కారగ్రహీత అభినవ సత్యభామ గురు కళాకృష్ణ, ఉమామహేశ్వరి దంపతులు, స్వరనర్తన అకాడమీ ఆంధ్రనాట్య కళాకారిణి దెందులూరి పద్మమోహన్, పోటీల న్యాయనిర్ణేతలు సీనియర్ ఆంధ్రనాట్య కళాకారిణులు రాధిక, అనుపమ, నవతా తదితరులతో కలిసి జ్యోతిప్రకాసనంచేసి ప్రత్యేకంగా చిన్నారులచే కుంభహారతి ప్రదర్శింపజేసి నృత్యపోటీలను ప్రారంభించి ప్రసంగించారు. క్రమేణా ఆదరణ కోల్పోతున్న ఆంధ్రనాట్యాన్ని అభివృద్ధిచేసే దిశగా కృషిచేస్తున్న నిర్వాహక సంస్థను, పద్మమోహన్‌లతోపాటు ప్రతీఒక్కరికి ధన్యవాదాలు తెలిపి పోటీల్లో పాల్గొన్న కళాకారులను ముఖ్యఅతిథి గురు కళాకృష్ణ మనస్ఫూర్తిగా ఆశీర్వదించారు. ఈ సందర్భంగా ఆంధ్రనాట్య సంగమం పేరుతో వరుసగా రెండవ సంవత్సరం నృత్యపోటీల విన్యాసాలు శోభాయమానంగా ప్రదర్శింపబడి ఆహుతుల ప్రశంసలందుకున్నాయి. ఆంధ్రనాట్య సంప్రదాయంలో సుమారు 70మంది ఔత్సాహిక విద్యార్థులు సీనియర్, జూనియర్, సబ్ జూనియర్ విభాగాల్లో పోటీపడి తమ తమ ప్రతిభను చాటుకున్నారు. చివరిగా అతిథుల చేతులమీదుగా పోటీల్లో పాల్గొన్న విద్యార్థులందరికీ ప్రోత్సాహకంగా సర్టిఫికెట్ తోపాటు బహుమతులను అందజేసి గురువులు పేరిణి కుమార్, పేరిణి శ్రీనివాస్, శారదా రామకృష్ణ, రేఖ, సంధ్యాపవన్, స్వప్న, సాత్వికలను ఘనంగా సత్కరించారు. ఈ పోటీల్లో విజేతలైన విద్యార్థులకు డిసెంబరులో ప్రత్యేకంగా ప్రదర్శనలు ఏర్పాటుచేసి బహుమతులు ప్రదానం చేయడం జరుగుతుందని పద్మమోహన్ తెలిపారు.

దేశ ఆర్థికాభివృద్ధిలో కాస్ట్, మేనేజ్‌మెంట్ అకౌంటెంట్స్ పాత్ర కీలకం

సైఫాబాద్, అక్టోబరు 26 ప్రభాతవార్త: దేశ ఆర్థికాభివృద్ధిలో కాస్ట్, మేనేజ్‌మెంట్ అకౌంటెంట్స్ కీలకపాత్ర పోషిస్తుందని ఇనిస్టిట్యూట్ ఆఫ్ కాస్ అకౌంట్స్ ఆఫ్ ఇండియా అధ్యక్షుడు బిభూతి భూషణ్‌నాయక్ చెప్పారు. శనివారం హిమాయత్‌నగర్‌లోని సిఎంఎ భవన్‌లో 'అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థలో కాస్ట్, మేనేజ్‌మెంట్ అకౌంట్స్ (పిఎంఎ)' పై జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. కాస్ట్ మేనేజ్‌మెంట్ , ఆడిటింగ్, ఫైనాన్షియల్ కన్సల్టెన్సీలో అవసరమైన నైపుణ్యాన్ని అందించడం, కాస్ట్ అండ్ మేనేజ్‌మెంట్ అకౌంట్స్ నిపుణుల వృద్ధిని పెంపొందించడం ద్వారా దేశ ఆర్థికాభివృద్ధికి దోహదపడే సుదీర్ఘ చరిత్ర ఈ సంస్థకు ఉందని ఆయన స్పష్టం చేశారు. కాస్ట్, మేనేజ్‌మెంట్ అకౌంటెంట్స్ పాత్ర పూర్తిగా మారిపోయిందన్నారు. ప్రస్తుతం ప్రభుత్వంలోనూ, పరిశ్రమల్లోను, కార్పోరేట్ ప్రపంచంలో సేవలు అందిస్తున్నారని ఆయన వివరించారు. ఈ సమావేశంలో ఐసిఎంఎఐ సెంట్రల్ కౌన్సిల్ సభ్యుడు డాక్టర్ కేసిహెచ్ ఏవిఎస్ మూర్తి, ఐసిఎంఎఐ హైదరాబాద్ చాప్టర్ ఛైర్ పర్సన్ డాక్టర్ లావణ్య కందుకూరి తదితరులు పాల్గొన్నారు.

జర్నలిస్ట్ అక్రెడిటేషన్ల జీవో 1395ను సవరించాలి

మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డికి టీడబ్ల్యూజేఎఫ్ నేతల విజ్ఞప్తి

మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డికి వినతిపత్రం అందచేస్తున్న టీడబ్ల్యూజేఎఫ్ నేతలు

ముషీరాబాద్, అక్టోబర్ 26, ప్రభాతవార్త: జర్నలిస్టుల అక్రెడిటేషన్ల జీవో నెంబర్ 1395ను తక్షణమే సవరించాలని తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ అధ్యక్ష కార్యదర్శులు మామిడి సోమయ్య, బి.బసవ పున్నయ్య విజ్ఞప్తి చేశారు. ఈమేరకు శనివారం ఫెడరేషన్ ఇతర నాయకులతో కలసి రాష్ట్ర సమాచార పౌరసంబంధాలు, రెవెన్యూ శాఖా మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డికి వినతి పత్రం అందచేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జర్నలిస్టుల అక్రెడిటేషన్ కార్డులకు సంబంధించి ప్రభుత్వం జారీ చేసిన జీవో 1395 లోప భూయిష్టంగా, ఏకపక్షంగా ఉందని ఆరోపించారు. జీవో 1395ను తక్షణమే సవరించి, అన్ని జర్నలిస్టు సంఘాలకు, చిన్న పత్రికలకు, మహిళా జర్నలిస్టులకు అక్రెడిటేషన్‌ల విధి విధానాల కమిటీలో ప్రాతినిధ్యం ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం వారు సమాచార పైర సంబంధాల శాఖ కమీషనర్ హనుమంతరావుకు అందించవలసిందిగా జాయింట్ డైరెక్టర్ జగన్‌కు వినతి పత్రం అందచేశారు. ఈ కార్యక్రమంలో ఫెడరేషన్ ఉపాధ్యక్షులు పి.ఆనందం, బండి విజయ్‌కుమార్, ప్రభాకర్, కార్యదర్శులు సలీమ, చంద్రశేఖర్, రాజశేఖర్, నేషనల్ కౌన్సిల్ మెంబర్ రమాదేవి, హెచ్‌యూజే కార్యనిర్వాహక కార్యదర్శి పి.నాగవాణి, విజయ తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్యకార్మికుల సేవలు అమోఘం

-తాడిబోయిన రామస్వామియాదవ్

పారిశుద్య కార్మికులను నూతన వస్త్రాలను అందిస్తున్న వాకర్స్ క్లబ్

శేరిలింగంపల్లి, అక్టోబర్ 26 ప్రభాతవార్త

యాంత్రిక జీవనంలో మనిషి ఆరోగ్యంగా ఉండాలంటే పరిసరాల పరిశుభ్రత ప్రధాన పాత్ర పోషిస్తుందని, పారిశుధ్య కార్మికుల సేవలు అమోఘమైనవని ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కన్వీనర్ తాడిబోయిన రామస్వామియాదవ్ అన్నారు. శేరిలింగంపల్లి డివిజన్ పరిధిలోని హుడా ట్రేడ్ సెంటర్ గ్రీన్‌పార్క్ నందు వాకర్స్ అసోసియేషన్‌కన్వీనర్ చౌడిశెట్టి బాలాజీ ఆధ్వర్యంలో పారిశుద్య కార్మికులకు దీపావళి పర్వదినం పురస్కరించుకుని నూతన వస్త్రాలు, స్త్రీలకు చీర,జాకెట్, పురుషులకు ఫ్యాంట్,షర్టులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హజరైన రామాలయ పాలక మండలి ముఖ్య సలహాదారు శ్రీరామ చంద్రమూర్తి,ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కన్వీనర్ తాడిబోయిన రామస్వామియాదవ్ లు మాట్లాడుతూ.. మానవుడు ఆరోగ్యంగా మనుగడ సాగించాలంటే పరిసరాల పరిశుభ్రత అవసరమని, ఆవిధంగా పరిసరాలను పరిశుభ్రపరిచే పారిశుద్య కార్మికులకు నూతన వస్త్రాలను బహుకరించటం ముదావహమన్నారు. అలాంటి గొప్పకార్యక్రమాలకు వదాన్యతను చాటిన చౌడిశెట్టి బాలాజీని వారు అభినందించారు.కార్యక్రమంలో కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు శ్రీనివాస్‌గౌడ్,మహేశ్‌గౌడ్, అమ్మయ్య చౌదరి,బుచ్చిరెడ్డి,వాకర్స్ అసోసియేషన్ నాయకులు యాదగిరిగౌడ్,సాయిబాబా,నరేంద్రబాబు,శ్రీనివాస్‌రావు, గోపిశెట్టి వెంకటేశ్వరరావు,సీనియర్ సిటిజన్స్ ,మహిళలు పాల్గొన్నారు.

ఎక్సైజ్ స్టేషన్లను పున:పరిశీలించాలి

సమావేశంలో మాట్లాడుతున్న యుగేంధర్‌గౌడ్

సైఫాబాద్, అక్టోబరు 26 ప్రభాతవార్త: గత ప్రభుత్వం అశాస్త్రీయంగా ఏర్పాటు చేసిన నూతన ఎక్సైజ్ స్టేషన్లను పున:పరిశీలించాలని బిసి పొలిటికల్ జెఎసి ఛైర్మన్ రాచాల యుగేంధర్‌గౌడ్ రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, శాఖ ముఖ్యకార్యదర్శికి వినతి పత్రాలను అందజేశామని శనివారం ఎన్ఎస్ఎస్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన తెలిపారు. గత ప్రభుత్వం హాయంలో కొంత మంది సంఘ నాయకులు దురాలోచనల మేరకు కొంత మంది అధికారుల పోస్టింగ్‌ల గురించి ఏలాంటి శాస్త్రీయతనున పాటించకుండా అడ్డగోలుగా గ్రేటర్ హైదరాబాద్‌లోని బాలానగర్, కుత్బుల్లాపూర్, మల్కాజ్‌గిరి, ఉప్పల్, ఘట్‌కేసర్, సరూర్‌నగర్, హయత్‌నగర్, శంషాబాద్, లింగంపల్లి, పటాన్‌చెరు, సికింద్రాబాద్, ముషీరాబాద్, అమీర్‌పేట, హనుమకొండ ఎక్సైజ్ స్టేషన్‌లను రెండుగా విభజించారని ఆరోపించారు. కొత్త స్టేషన్ల ఏర్పాటులో శాస్త్రీయత లోపించిందని, ఆ స్టేషన్ల పరిధిలో నేరాల సంఖ్యగాని భౌగోళిక విస్తీర్ణంను గాని పరిగణంలోకి తీసుకోకుండా ఏకపక్షంగా విభిజించారని ఆయన చెప్పారు. తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం జోక్యం చేసుకుని స్టేషన్లను పున:పరిశీలించాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో జెఎసి నాయకులు బడేసాహెబ్, సాయిబాబా, సుమన్, నగేష్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

జర్నలిస్టులకు కేటాయించిన స్థలంలో ఇళ్ల నిర్మాణానికి పూర్తి సహకారం

-పిఎసి ఛైర్మన్,ఎమ్మెల్యే గాంధీ హామీ

-జర్నలిస్టు ఇళ్ల నిర్మాణం కోసం మరో ఎకరా స్థలం మంజూరు కోసం ప్రయత్నం

-శేరిలింగంపల్లి ప్రెస్‌క్లబ్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే గాంధీని కలిసి జర్నలిస్టులు

శేరిలింగంపల్లి ఎమ్మెలే్య గాంధీకి వినతిపత్రాన్ని అందిస్తున్న జర్నలిస్టు నాయకులు

శేరిలింగంపల్లి, అక్టోబర్ 26 ప్రభాతవార్త

శేరిలింగంపల్లి జర్నలిస్టులకు కేటాయించిన స్థలంలో ఇళ్ల నిర్మాణానికి తన వంతు పూర్తిసహకారం అందిస్తామని పీఏసీ ఛైర్మన్,శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ హామీ ఇచ్చారు. శేరిలింగంపల్లి ప్రెస్‌క్లబ్ (టీయూడబ్ల్యూజే) ఆధ్వర్యంలో రాష్ట్ర,జిల్లాస్థాయి జర్నలిస్టు నాయకులతో కలిసి ఎమ్మెల్యే గాంధీని ఆయన నివాసంలో శనివారం సమావేశమయ్యారు. చందానగర్‌లోని సర్వేనంబర్ 174లో కేటాయించిన 1ఎకరా స్థలంలో జర్నలిస్టులకు ఇళ్ల నిర్మాణం చేపట్టేందుకు సహకరించాలని, అదేవిధంగా సర్వేనంబర్ 152లో మరో 1ఎకరా స్థలాన్ని జర్నలిస్టులకు ఇళ్ల నిర్మాణకోసం మంజూరు చేసే విధంగా చొరవతీసుకోవాలని కోరుతూ శేరిలింగంపల్లి ఎమ్మెల్యే గాంధీకి జర్నలిస్టులు వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా టీయూడబ్ల్యూజే రాష్ట్ర కార్యదర్శి పైళ్ల విఠల్‌రెడ్డి,రంగారెడ్డిజిల్లా అధ్యక్షులు ఉప్పరి శేఖర్‌సాగర్,జిల్లా ఉపాధ్యక్షులు గంట్ల రాజిరెడ్డి, శేరిలింగంపల్లి ప్రెస్‌క్లబ్ అధ్యక్షులు ఉప్పరి రమేశ్ సాగర్‌ల ఆధ్వర్యంలో ఎమ్మెల్యేతో సమావేశమై ఇళ్ల నిర్మాణంపై చర్చించారు. ఈ సందర్భంగా జర్నలిస్టు నాయకులు మాట్లాడుతూ.. దశాబ్దాలుగా శేరిలింగంపల్లిలో జర్నలిస్టులుగా పనిచేస్తూ సొంత ఇళ్లు లేక ఇబ్బందులు పడుతున్న జర్నలిస్టుల కోసం ఎమ్మెల్యే గాంధీ సహకారంతో చందానగర్ లోని సర్వేనంబర్ 174లో 1ఎకరం భూమిని ప్రభుత్వం కేటాయించిందని అన్నారు. జర్నలిస్టులకు కేటాయించిన భూమిలో ఎమ్మెల్యే గాంధీ చేతుల మీదుగా గతంలో భూమి పూజా కార్యక్రమాలు నిర్వహించిన విషయాన్ని గుర్తుచేశారు. జర్నలిస్టుల ఇళ్ల కోసం కేటాయించిన భూమిలో ఇళ్ల నిర్మానం చేపట్టేందుకు సహకరించాలని, భూమి కేటాయింపులో మందుండి మంజూరు చేయించిన ఎమ్మెల్యే గాంధీ ఇళ్ల నిర్మాణంలో సైతం సహకరించాలని కోరారు. శేరిలింగంపల్లిలో జర్నలిస్టుల సంఖ్య ఎక్కువగా ఉన్న కారణంగా పక్కనే ఉన్న సర్వేనంబర్ 152లో ఉన్న మరో 1ఎకరా స్థలాన్ని మంజూరు చేయించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గాంధీ మాట్లాడుతూ.జర్నలిస్టుల సొంతింటి కలను సాకారం చేసేందుకు చందానగర్‌లో కేటాయించిన భూమిల ఇళ్ల నిర్మాణం కోసం తన వంతు సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు. జర్నలిస్టుల ఇళ్ల స్థలాల కోసం తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సుముఖంగా ఉన్నారని ఆయన తెలిపారు. చందానగర్ సర్వేనంబర్ 152లో 1ఎకరా స్థలం మంజూరు కోసం తాను గతంలో హామీ ఇచ్చానని, సదరు స్థలం జర్నలిస్టుల హౌసింగ్ కోసం కేటాయించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. శేరిలింగంపల్లి మండల జర్నలిస్టుల సొంతింటి కలను సాకారం చేసేందుకు జర్నలిస్టులకు అండగా ఉంటానని,సమిష్టి కృషితో ఇళ్ల నిర్మాణం పూర్తిచేసుకుందామని ఆయన అన్నారు. ఎమ్మెల్యేను కలిసి వారిలో జర్నలిస్టు నాయకులు జగన్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి, శ్రీనివాస్,ఆశోక్, వినయ్‌కుమార్, బేగ్,కిశోర్‌లతో పాటు శేరిలింగంపల్లి ప్రెస్ క్లబ్,టెంజు కార్యవర్గసభ్యులు, మండల పరిధిలోని జర్నలిస్టులు పాల్గొన్నారు.

జలమండలి డివిజన్-3 జిఎంగా శ్రీనునాయక్

జలమండలి జీఎంతో మాట్లాడుతున్న వై.అనీల్‌చారి.

మెహిదీపట్నం, అక్టోబర్ 26, ప్రభాతవార్త : జలమండలి డివిజన్ - 3 జీఎంగా శ్రీనునాయక్ శనివారం పదవీ బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా నవోదయ కాలనీలోని జలమండలి డివిజన్ కార్యాలయంలో శ్రీనునాయక్‌ను బాలాజీనగర్ నల్లపోచమ్మ దేవాలయ చైర్మన్ వై.అనీల్‌చారి కాలనీ సభ్యులతో కలిశారు. ఈ సందర్భంగా బాలజీనగర్‌లో నెలకొంటున్న డ్రైనేజీ, తాగునీటి సమస్యలను ఆయన దృష్టికి తీసుకెల్లారు. బాలాజీనగర్‌లో ఎలాంటి తాగునీటి, డ్రైనేజీ సమస్యలు తలెత్తకుండ అన్ని చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. అనంతరం శ్రీనునాయక్‌కు శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. సన్మానించిన వారిలో సభ్యులు రాజు, రంగారెడ్డి, శ్రీనివాస్‌చారి, రఘువీర్, భరణి, మహేష్ కుమార్‌లు ఉన్నారు.

ఓయూ వైస్ ఛాన్స్‌లర్‌కు సత్కారం

ఓయూ నూతన వీసీని సత్కరిస్తున్న మాదిగ జర్నలిస్టు ఫోరం నాయకులు

ముషీరాబాద్, అక్టోబర్ 26, ప్రభాతవార్త: ఉస్మానియా యూనివర్సిటీ నూతన వైస్ ఛాన్స్‌లర్‌గా బాధ్యతలు చేపట్టిన ప్రొఫెసర్ ఎం.కుమార్‌ను జర్నలిస్టు ఫోరం నేతలు కలిసి శాలువాతో సత్కరించారు. శనివారం వీసీ కార్యాలయంలో ఫోరం హైదరాబాద్ జిల్లా అధ్యక్షులు ఎం.జహంగీర్ ఆధ్వర్యంలో ఎం.కుమార్‌ను కలిసి అభినందనలు తెలియచేశారు. ఈ కార్యక్రమంలో ఫోరం నేతలు సామ్రాట్, అజయ్, వంశీ పాల్గొన్నారు.

తెలంగాణ ప్రభుత్వం
హైదరాబాద్ మహానగర పాలక సంస్థ
అర్బన్ బయోడైవెర్సిటీ, శేరిలింగంపల్లి జోన్

లేఖ నం. 40/DD/SLPZ/GHMC/2024-25, తేదీ: 26.10.2024

GHMC, శేరిలింగంపల్లి జోన్‌లో వివిధ ఆమపచ్చ సంబంధిత పనుల అభివృద్ధి కొరకు దిగువ పేర్కొన్న మొక్కల రేట్స్ కొరకు సీల్డ్ కొటేషన్లు కోరబడుతున్నవి. డిప్యూటీ డైరక్టర్, అర్బన్ బయోడైవర్సిటీ వింగ్, శేరిలింగంపల్లి జోన్, GHMC, వారి కార్యాలయంలో 28.10.2024 ఉ.10.30గం. నుండి 01.11.2024 మ.1.00గం.కు సీల్డ్ కొటేషన్లు చేరవలెను. 01.11.2024న మ.2.00గం. వద్

పారిశుధ్య పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత

-కార్పొరేటర్ కొత్తకాపు అరుణ రవీందర్‌రెడ్డి

పారిశుధ్య పనులు పర్యవేక్షిస్తున్న కార్పొరేటర్ కొత్తకాపు అరుణ రవీందర్‌రెడ్డి

సైదాబాద్, అక్టోబరు 26 ప్రభాతవార్త: పారిశుధ్య పరిరక్షణలో ప్రతి ఒక్కరు భాగస్వాములు కావాలని సైదాబాద్ డివిజన్ కార్పొరేటర్ కొత్తకాపు అరుణ రవీందర్‌రెడ్డి అన్నారు. శానిటేషన్ స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా డివిజన్ పరిధిలోని రెడ్డి బస్తీ, హరిజనబస్తీ, న్యూ సైదాబాద్ కాలనీ, హౌజింగ్ బోర్డు కాలనీలో రోడ్ల వెంట ఉన్న డెబ్రిస్, చెత్తా చెదారాన్ని తొలగించారు. ఈ పనులను పర్యవేక్షించిన అనంతరం కార్పొరేటర్ మాట్లాడుతూ ఇండ్లలోని చెత్తను రోడ్లపై వేయకుండా చెత్త రిక్షా కార్మికులకు అందజేయాలని సూచించారు. డెబ్రిస్‌ను రోడ్ల పక్కన వేయడం వల్ల పాదచారులకు, వాహనదారులకు ఇబ్బందులు తలెత్తుతాయన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎంఓహెచ్ అనురాధ, జవాన్ నర్సింగ్‌రావు, ఎస్ఎఫ్ఏ ప్రసాద్, మహేందర్, కాలనీవాసులు సుధీర్, రాజు, చాగంటి, నవీన్, రఘు పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాల విద్యార్థినిలకు జాబ్ రెడీనెస్ ప్రోగ్రామ్‌పై శిక్షణ

హయత్‌నగర్, అక్టోబరు 26 ప్రభాతవార్త: విద్యార్థినిలు చదువుతోపాటు విషయ పరిజ్ఞానాన్ని, భావ వ్యక్తీకరణను పెంచుకోవాలని హయత్‌నగర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డా.జోత్స్నప్రభ అన్నారు. ఎన్జీవోసంస్థ ఉమిడ్ ఆధ్వర్యంలో హయత్‌నగర్‌లోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శనివారం జాబ్‌రెడీనెస్ ప్రోగ్రామ్, శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డిగ్రీ తృతీయ సంవత్సరం విద్యార్థులకు ఉద్యోగ నైపుణ్యాలను వృద్ధి చేసుకోవడం, ఆయా విభాగాలలో ఉద్యోగావకాశాలు ఎలా ఉంటాయనే అంశాలపై అవగాహణ కల్పించడం జరిగింది. మహిళలు స్వతహాగా అవకాశాలు సృష్టించుకుని సాధికారతను పెంపొందించుకోవాలని సూచించారు. ఉమిడ్ సంస్థ ప్రతినిధులు ఉద్యోగ సమాచారాన్ని వివరించారు. శిక్షణా కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థినిలకు సర్టిఫికెట్లు కూడా ఇవ్వడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో వైస్‌ప్రిన్సిపల్ శ్రీనివాస్‌రెడ్డి, టాస్క్, అకాడమిక్ కోఆర్డినేటర్లు మక్క, డా.బి.నరసింహ, అధ్యాపకులు డా. విజయలక్ష్మి,పి.విద్యాసాగర్, డా.ప్రవీణ్, డా.కృష్ణమోహన్ పాల్గొన్నారు.

మున్సిపాలిటీ అభివృద్ధి లక్ష్యంగా పనిచేస్తున్నాం

: పండుగుల జయశ్రీ, చైర్‌నర్సన్

సీసీరోడ్డు పనుల ప్రారంభోత్సవంలో చైర్‌పర్సన్

హయత్‌నగర్, అక్టోబరు 26 ప్రభాతవార్త: ప్రజా సమస్యలను పరిష్కరిస్తూ మున్సిపాలిటీ అభివృద్ధి లక్ష్యంగా పనిచేస్తున్నామని పెద్దఅంబర్‌పేట మున్సిపాలిటీ చైర్‌పర్సన్ పండుగుల జయశ్రీరాజు అన్నారు. మున్సిపాలిటీ పరిధి 6వ వార్డులో 30 లక్షల రూపాయల వ్యయంతో చేపటనున్న సీసీరోడ్డు పనులను ఆమె శనివారం కౌన్సిలర్ పసుల రాజేందర్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ మాట్లాడుతూ... నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. డ్రైనేజీ, తాగునీరు, రోడ్ల వంటి కనీస సదుపాయాలను ప్రాధాన్యతనిస్తున్నామని తరువాత వీదిదీపాలు, ఇతర అభివృద్ధి పనులకు నిధులను కేటాయిస్తున్నట్లు తెలిపారు. కౌన్సిలర్ రాజేందర్ మాట్లాడుతూ... వార్డు ప్రజల సమస్యలను తెలుసుకుని వాటిని పరిష్కరిస్తున్నట్లు పేర్కన్నారు. కార్యక్రమంలో వైస్‌చైర్‌పర్సన్ చామ సంపూర్ణావిజయశేఖర్‌రెడ్డి, కమిషనర్ రవీందర్‌రెడ్డి, కౌన్సిలర్లు దండెం కృష్ణారెడ్డి, నాయకులు నర్సింగ్ పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి

చైర్‌పర్సన్‌కు వినతిపత్రం అందిస్తున్న వెంకటేష్‌యదవ్

హయత్‌నగర్, అక్టోబరు 26 ప్రభాతవార్త: పెద్దఅంబర్‌పేట మున్సిపాలిటీలో ఇటీవల విలీనమైన తారామతిపేట గ్రామంలో సమస్యలను పరిష్కరించాలని కోరుతూ మాజీ ఎంపీటీసీ వెంకటేష్ యాదవ్ శనివారం చైర్‌పర్సన్ పండుగుల జయశ్రీ, వైస్‌చైర్‌పర్సన్ సంపూర్ణారెడ్డిలను కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ... గ్రామంలో పలు కాలనీల్లో సీసీరోడ్లు వేయాలని, డ్రైనేజీ, తాగునీటి పైప్‌లైన్‌ను వేయించాలని కోరారు. వీధిదీపాలకు మరమ్మతులు చేయించాలని, సిబ్బంది వేతనాలు పెంచాలని, గ్రామంలో కంపచెట్లను తొలగించాలని విన్నవించారు.

దివ్యాంగుల సంక్షేమమే ధ్యేయంగా కార్పొరేషన్‌లో మార్పులు : చైర్మన్ ముత్తినేని వీరయ్య

మేనేజ్‌మెంట్ కమిటీ సమావేశంలో పాల్గొన్న చైర్మన్ ముత్తినేని వీరయ్య ఎండి శైలజ తదితరులు

మలక్‌పేట అక్టోబరు26,ప్రభాతవార్త : దివ్యాంగుల సంక్షేమమే ధ్యేయంగా వికలాంగుల కార్పొరేషన్‌లో భారీ మార్పులు చేపడుతున్నామని వికలాంగుల సహకార సంస్థ చైర్మన్ ముత్తినేని వీరయ్య పేర్కొన్నారు.గ్రామీణ మారుమూల ప్రాంతాలలో నివసించే చివరి వికలాంగుల వరకు లబ్ధి చేకూరేల ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని ఆయన తెలిపారు.వికలాంగుల సంక్షేమ భవన్‌లో సుదీర్ఘంగా ఆయన అధికారులతో మేనేజ్మెంట్ కమిటీ సమావేశంలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ....గత ప్రభుత్వం పదేళ్ల పాలనలో వికలాంగుల పరికరాల కోసం రూ.64 కోట్లు కేటాయిస్తే కాంగ్రెస్ ప్రభుత్వం సంవత్సరకాలంలోనే రూ.50 కోట్లు కేటాయించిందని వివరించారు.మేనేజ్మెంట్ కమిటీ సమావేశంలో చేసిన పలు తీర్మానాలను కూడా అయినా వెల్లడించారు.ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు వికలాంగుల హక్కుల చట్టం-2016ను సంపూర్ణంగా అమలు చేస్తామన్నారు.గత ప్రభుత్వ హయాంలో 75 శాతం వైకల్యం ఉన్నవారికి మాత్రమే పరికరాలు అందించేవారని ,కానీ దేశంలోనే మొదటిసారిగా బెంచ్ మార్క్ వైకల్యం 40శాతం ఉన్నవారికి కూడా అవసరమైన పరికరాలు అందిస్తామని తెలిపారు.దివ్యాంగులకు విద్యార్థి నేస్తం పేరుతో ల్యాప్‌టాప్‌లు,హెలెన్ గిఫ్ట్ పేరుతో స్మార్ట్ ఫోన్లు అందజేస్తామని తెలిపారు.క్రీడాకారులకు అండగా ఉంటామని పేర్కొన్నారు.కార్పొరేషన్‌లో పనిచేసే వికలాంగ ఉద్యోగుల సమస్యలు పరిష్కరిస్తామని తెలిపారు.ఈ సమావేశంలో కార్పొరేషన్ ఎండి శైలజ,జిఎం ప్రభంజనరావు,తదితరులు పాల్గొన్నారు.

అమరుల స్ఫూర్తితో ప్రజా ఉద్యమాలు కొనసాగిస్తాం

-సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు కిషన్

తుర్కయంజాల్ అక్టోబరు26,ప్రభాతవార్త : ప్రజాపోరాట యోధులు,బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతులు సిపిఎం పార్టీ రంగారెడ్డి జిల్లా ఉద్యమ నిర్మాతలు కామ్రేడ్ మహబూబ్ పాషా నరహరి 35వ వర్ధంతిని పురస్కరించుకొని తుర్కయంజాల్ సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో రాగన్నగూడలోని పార్టీ కార్యాలయంలో అమరులు పాషా నరహరి చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా సిపిఎం రంగారెడ్డి జిల్లా కమిటీ సభ్యులు,తుర్కయంజాల్ మున్సిపాలిటీ కన్వీనర్ కిషన్ ,పార్టీ సీనియర్ నాయకులు అరుణ్ కుమార్‌లు మాట్లాడుతూ....1989 అక్టోబరు 26వ తేదిన నేటికి సరిగ్గా 35 సంవత్సరాల క్రితం ఇబ్రహీంపట్నం ప్రాంతంలో భూస్వాముల ఆగడాలకు వ్యతిరేకంగా,వెట్టిచాకిరి నుండి ప్రజలను విముక్తి చేయడం కోసం, దున్నే వానికి భూమి కావాలని పనిచేసే వారందరికీ శ్రమకు తగ్గ ఫలితం ఇవ్వాలని ఆనాడు గ్రామ గ్రామాన తిరిగి పేద ప్రజలందరినీ ఏకం చేసి ఎర్రజెండా అండతో అనేక భూ పోరాటాలు,కూలి పోరాటాలు నడిపిన చరిత్ర పాషా నరహరికు ఉందని కొనియాడారు.ఈ ప్రాంతంలోని ఎస్సి ఎస్టి,బిసి మైనార్టీ అగ్రవర్ణాల్లోని పేదలందరినీ చేరదిసి సామాజిక ఉద్యమాలతో పాటు వారు పడుతున్న బాధ లన్నింటికి పోరాటాల ద్వారానే పరిష్కారం లభిస్తుందని తెలియజేసి ఎర్రజెండా నాయకత్వన ప్రజలందరినీ చైతన్య పరిచి గ్రామ గ్రామాన సిపిఎం పార్టీ బలోపేతానికి కృషి చేశారని అన్నారు.ఈ కార్యక్రమంలో సిపిఎం తుర్కయంజాల్ మున్సిపల్ నాయకులు మండల సత్యనారాయణ జంగిలి ఆశీర్వాదం,బడుగు శంకరయ్య,పల్లె కృష్ణ, పగిళ్ల మధు,అరెడ్ల మాధవరెడ్డి,మండల విజయ్ కుమార్, తోడే కృష్ణ కుమార్,మహమ్మద్ జాఫర్ వస్కుల భాస్కర్ ,నరేష్,రవి కుమార్,తదితరులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక చింతనే ముక్తికి సోపానం : బాల బ్రహ్మానందం స్వామి

మల్కాజిగిరి అక్టోబరు26,ప్రభాతవార్త : సమాజ శ్రేయస్సును కాంక్షిస్తూ భగవంతుని అనుగ్రహం పొందడానికి ఉత్తమమైన మార్గం ఆధ్యాత్మిక చింతనే యోగ్యమైనదని నైమిశారణ్యం పీఠాధిపతి పూజ్య శ్రీ బాల బ్రహ్మానంద సరస్వతి స్వామి వారు అన్నారు.శనివారం ఆనంద్ బాగ్ శ్రీ లక్ష్మి వెంకటేశ్వర స్వామి ఆలయంలో శ్రీ వెంకటేశ్వర లీల విన్యాసం గురించి అనుగ్రహ భూషణం చేశారు.ఈ సందర్భంగా ఆలయ కార్యనిర్వహణాధికారి ఎ.బి రవీందర్ రెడ్డి ,అర్చకస్వాములు పీఠాధిపతికి ఘన స్వాగతం పలికారు.అనంతరం పూజ్య శ్రీ బాల బ్రహ్మానంద స్వామి వారు అనుగ్రహ భాషణం చేస్తూ స్వామి వారికి అత్యంత ప్రీతికరమైన సేవల్లో కళ్యాణోత్సవం ఒక్కటి అని అన్నారు.వెంకటేశ్వర స్వామి వారు వరదకటిక హస్తాలతో దర్శనం ఇస్తూ సంసార సాగరంలో చిక్కుకొని ఉన్న భక్త జనుల్ని కాపాడుతున్నారని అన్నారు. స్వామి వారు కలియుగ ప్రత్యేక దైవంగా తిరుమల గిరులుపై వెలసి లోకాన్ని రక్షిస్తున్నారని పేర్కొన్నారు. ఋషుల మహత్యాన్ని వివరించారు.ఈ కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణ అధికారి ఏబి రవీంద్ర రెడ్డి, ఆలయ ప్రధాన అర్చకులు ముడుంబై వెంకట రమణాచార్యులు అర్చకులు తులసి వెంకట రమణా చార్యులు ,కొండపాక వేణు గోపాల చార్యులు,తదితరులు అధిక సంఖ్యలో భక్తజనులు పాల్గొన్నారు.

డిగ్రీతో పాటు సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంపొందించుకోవాలి: మాజీ ఎంపీ

సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎంపీ శ్రీనివాసరావు

ఎల్.బి.నగర్, అక్టోబర్ 26 ప్రభాతవార్త: పోటీ ప్రపంచంలో డిగ్రీ చదువుతోపాటు సాంకేతిక పరిజ్ఞానాన్ని కూడా పెంపొందించుకోవాలని మాజీ ఎంపీ, అవంతి కళాశాల చైర్మన్ శ్రీనివాసరావు పేర్కొన్నారు. అవంతి డిగ్రీ పీజీ కళాశాల 23వ వార్షికోత్సవం శనివారం నాగోల్ కళ్యాణలక్ష్మి కన్వెన్షన్ సెంటర్లో నిర్వహించగా ఆయన ముఖ్యఅతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు అన్ని అంశాలపై దృష్టి సారించాలని సూచించారు. ఉస్మానియా యూనివర్సిటీ రిజిస్టర్ లక్ష్మీనారాయణ మాట్లాడుతూ విద్యార్థులు లక్ష్యంతో ముందుకు సాగుతూ జాతి గౌరవాన్ని పెంపొందించడంతోపాటు ఆధునిక సాంకేతికతపై అవగాహన పెంపొందించుకోవాలన్నారు. మన విజ్ఞానాన్ని దేశ భవిష్యత్తు కోసం ఉపయోగించేలా విద్యార్థులు ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగాలన్నారు. ఈ సందర్భంగా విద్యార్థినీ విద్యార్థులు ఆట పాటలు, సాంస్కృతిక కార్యక్రమాలతో అలరింపజేశారు. ఈ కార్యక్రమంలో ప్రొఫెసర్ లక్ష్మీకాంత్‌రాథోడ్, సిద్దిక్ అహ్మద్, ఆర్.రవికుమార్, ఎం.ప్రియాంక, ప్రిన్సిపల్ ఎస్.అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

బడంగ్‌పేట్ కార్పొరేషన్‌లో చెత్త సమస్యలపై బిజెవైఎం వినూత్న నిరసన

-పేరుకుపోయిన చెత్త కుప్పల వద్ద కార్పొరేషన్ నిర్లక్ష్యాన్ని ఎండగట్టిన నేతలు

బడంగ్‌పేట్‌లో వినూత్నంగా నిరసన తెలుపుతున్న బిజెవైఎం నాయకులు

సరూర్‌నగర్, అక్టోబర్ 26 ప్రభాతవార్త: బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లోని వివిధ ప్రాంతాల్లో కార్పొరేషన్ నిర్లక్ష్యం మూలంగా గుట్టలుగా పేరుకుపోయిన చెత్త కుప్పల వద్ద బిజెవైఎం ఆధ్వర్యంలో వినూత్నంగా నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఇందులో భాగంగా కార్పొరేషన్ పరిధిలో గుట్టలుగా వేసిన చెత్త కుప్పల వద్ద మున్సిపల్ కార్పొరేషన్ బిజెవైఎం అధ్యక్షుడు రాళ్ళగూడెం రామకృష్ణారెడ్డి నాయకత్వంలో బిజెపి, యువమోర్చా నాయకులు, కార్యకర్తలు ఐ లవ్ బడంగ్‌పేట్ పేరుతో అక్షరాల ప్లకార్డులు ప్రదర్శించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ కార్పొరేషన్ నిర్లక్ష్యం వల్లే డివిజన్లలో పారిశుధ్యం లోపించిందని విమర్శించారు. మేయర్ స్వంత డివిజన్‌లోనే చెత్త గుట్టలుగా పేరుకుపోయిందని వారు ఎద్దేవా చేశారు. మేయర్ డివిజన్‌లోనే ఆ విధంగా ఉంటే ఇక మిగతా ప్రాంతాల పరిస్థితి ఏ విధంగా ఉంటుందని ఆయన ప్రశ్నించారు. ఈ మేరకు ఆయన అధికారుల నిర్లక్ష్యాన్ని ఎండగట్టారు. మేయర్, కమీషనర్, సంబంధిత సానిటరీ ఇన్స్‌పెక్టర్లు కార్పొరేషన్‌లో గుట్టలుగా పేరుకుపోయిన చెత్త కుప్పలు ప్రాంతాల్లో పర్యటించి చెత్త సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో సంబంధిత కాలనీవాసులతో కలిసి కార్పొరేషన్ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఎ.మహేందర్, గోపాల్, సాయి సంతోష్, లక్ష్మణ్, సైదులు, నరేష్, ప్రవీణ్‌గౌడ్, జి.మల్లేష్, శివ, మహేందర్, శ్రీనివాసచారి, శ్రీరాములు, రాజేష్ పాల్గొన్నారు.

మహిళా సాధికారత కోసం ప్రభుత్వం కృషి

-డిప్యూటీ మేయర్ శ్రీలత శోభన్‌రెడ్డి

కుట్టు శిక్షణా సెంటర్‌ను ప్రారంభిస్తున్న డిప్యూటీ మేయర్ శ్రీలత శోభన్‌రెడ్డి

తార్నాక, అక్టోబర్ 26 ప్రభాతవార్త: మహిళా సాధికారత కోసం ప్రభుత్వం కృషి చేస్తుందని నగర డిప్యూటీ మేయర్ శ్రీలత శోభన్‌రెడ్డి పేర్కొన్నారు. మాణికేశ్వరీనగర్ బస్తీలో ఇంద్ర మహిళా శక్తి పథకం కింద ఏర్పాటు చేసిన కుట్టు శిక్షణా కేంద్రాన్ని డిప్యూటీ మేయర్ ముఖ్య అతిథులుగా హాజరై ప్రారంభించారు. శిక్షణ పొందిన మహిళలు స్వావలంబన సాధించడానికి, ఆర్థికంగా ఎదగడానికి మేలు చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో జీహెచ్ఎంసీ డీపిఓ శ్రీనాథ్, శ్రీవాణి, సెల్ఫ్‌హెల్ప్ గ్రూప్స్ సభ్యులతో పాటు స్థానిక కాంగ్రెస్ నాయకులు వేముల శ్రీనివాస్, లింగయ్య, పవన్‌కళ్యాణ్, బోదాసు నరసింహ్మ, లాజరస్, మక్బూల్, ఇర్షాద్, గండి కోట వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

ఖాళీ స్థలంపై కన్నేసి దౌర్జన్యం చేస్తున్న వారిపై కాలనీవాసుల ఫిర్యాదు

సరూర్‌నగర్, అక్టోబర్ 26 ప్రభాతవార్త: మీర్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లోని జిల్లెలగూడ శ్రీ శక్తినగర్‌లో ప్రజోపయోగార్థం లేఔట్‌లో వదిలిన 355 గజాల ఖాళీ స్థలాన్ని ఆక్రమించే ప్రయత్నంలో తమపై దౌర్జన్యం చేస్తూ బెదిరిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని పలువురు కాలనీవాసులు శనివారం మీర్‌పేట్ ఇన్స్‌పెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా పెద్ద సంఖ్యలో కాలనీవాసులు మీర్‌పేట్ పిఎస్‌కు తరలివచ్చి ఇన్స్‌పెక్టర్ నాగరాజును కలిసి ఫిర్యాదును అందజేశారు. ఈ మేరకు వారు 1979 లో చేసిన లేఔట్‌లో కాలనీలో ప్రజోపయోగ పనుల కోసం వదిలిన 355 గజాల ఖాళీ స్థలం గురించి.. దానిని ఆక్రమించడానికి కొందరు చేస్తున్న దౌర్జన్యాలను ఇన్స్‌పెక్టర్‌కు వివరించారు. ఈ నేపథ్యంలో విచారణ జరిపి బాధ్యులైన వారిపై చర్యలు తీసుకోవాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో ధ్యాసాని సుధాకర్‌రెడ్డి, జ్ఞానేశ్వర్‌చారి, మల్లారెడ్డిలతో పాటు పలువురు పాల్గొన్నారు.

హుడా కాలనీ సంక్షేమానికి కాలనీ సంఘం కృషి

లోగో, రిజిస్ట్రేషన్‌లను ఆవిష్కరిస్తున్న గడివేముల కృష్ణ తదితరులు

సరూర్‌నగర్, అక్టోబర్ 26 ప్రభాతవార్త: మీర్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లోని హుడా వీకర్ సెక్షన్ కాలనీ సంక్షేమానికి కృషి చేస్తామని సంఘం గౌరవ అధ్యక్షుడు గడివేముల కృష్ణ తెలిపారు. శనివారం ఆయన కాలనీ కార్యవర్గంతో కలిసి సంక్షేమ సంఘం రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్, లెటర్ ప్యాడ్, బస్తీ కమిటీ లోగోను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్పొరేషన్‌లో మిగతా కాలనీలకు ధీటుగా పాతదైన హుడా కాలనీని తీర్చిదిద్దుతామని స్పష్టం చేశారు. ఈ నేపథ్యంలో కాలనీవాసులు సహకరించాలని కృష్ణ కోరారు.

సిసి కెమెరాల ఏర్పాటు కోసం సర్వే

కాలనీల్లో సర్వే చేస్తున్న బైగళ్ళ ఓం ప్రకాశ్ తదితరులు

సరూర్‌నగర్, అక్టోబర్ 26 ప్రభాతవార్త: మీర్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లోని 19వ డివిజన్‌లో దాదాపు రూ.10 లక్షలతో సిసి కెమరాలను ఏర్పాటు చేయనున్నామని కాలనీ అధ్యక్షుడు బైగళ్ళ ఓం ప్రకాశ్ తెలిపారు. శనివారం కాలనీలో ఎక్కడెక్కడ కెమెరాలను ఏర్పాటు చేయాలనే దానిపై డివిజన్‌లోని అంబేద్కర్‌నగర్, గాయత్రీనగర్, ఈస్ట్ గాయత్రీనగర్ తదితర ప్రాంతాల్లో సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాలనీల్లో దొంగతనాల నివారణకు అదే విధంగా కాలనీల ప్రజలతో పాటు పోలీసులకు ఉపయోగపడే విధంగా ఉండేందుకు 50 హై డెఫినేషన్ నైట్ విజన్ సిసి కెమెరాలను ఏర్పాటు చేయనున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాల కుమార్, శ్రీరామ్‌నాయక్, సూదకేశవ్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

కేవీయన్ రెడ్డిని సత్కరించిన కాంగ్రెస్ నాయకులు

కేవీయన్‌రెడ్డిని సన్మానిస్తున్న శశిధర్‌రెడ్డి

ఎల్.బి.నగర్, అక్టోబర్ 26 ప్రభాతవార్త: రాష్ట్ర వ్యవసాయ రైతుల సంక్షేమ శాఖ కమిషన్ సబ్యునిగా నియామకమైన మహబూబ్నగర్ జిల్లా జలసాధన సమితి అధ్యక్షుడు కేబీఎన్‌రెడ్డిని చైతన్యపురి డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కే.శశిధర్‌రెడ్డి ఆధ్వర్యంలో శనివారం శాలువాతో సత్కరించి పుష్పగుచన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర రైతు సంక్షేమ అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు కౌశిక్, పరశురాం, కిషోర్ పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి : చింతల

ఎల్.బి.నగర్, అక్టోబర్ 26 ప్రభాతవార్త: ఉచిత వైద్య శిబిరాలను ప్రజల సద్వినియోగం చేసుకోవాలని నాగోల్ కార్పొరేటర్ అరుణసురేందర్‌యాదవ్ పేర్కొన్నారు. నాగోల్ డివిజన్ ఇంద్రప్రస్థకాలనీలో హ్యూమానిటీ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన మెగా ఉచిత వైద్య శిబిరాన్ని కార్పొరేటర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్కు వైద్యులు ఆరోగ్య పరీక్షలు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కాలనీవాసులు ఆరోగ్యం పట్ల ప్రత్యేక వహించాలన్నారు.ఈ కార్యక్రమంలో హ్యూమానిటీ చారిటబుల్ ట్రస్ట్ నిర్వాహకులు కాలంశెట్టి లయ, వరకుమార్, నీరజ, కాశీనాథం, గోపాల్, చంద్రశేఖర్‌గుప్త, నరేందర్‌రెడ్డి, ప్రభాకర్, అనితా తదితరులు పాల్గొన్నారు.

ప్రహరీ కూల్చిన వారిపై చర్య తీసుకోవాలి

మధు యాష్కీకి వినతి పత్రం అందజేస్తున్న కాలనీవాసులు

ఎల్.బి.నగర్, అక్టోబర్ 26 ప్రభాతవార్త: బండ్లగూడలో ప్రభుత్వ పాఠశాల ప్రహరీ గోడను ప్రైవేటు వ్యక్తులు ఇటీవల కూల్చివేసిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ మధు యాష్కీగౌడుకు బండ్లగూడ ఓల్డ్‌విలేజ్ వాసులు వినతి పత్రాన్ని అందజేశారు. కోర్టు కేసుకు సంబంధం లేని పాఠశాల భవనాన్ని కూల్చిన విషయంపై అధికారులతో మాట్లాడి చర్యలు చేపట్టాలని గ్రామస్తులు మధుయాష్కి గౌడ్‌ను కోరారు. అందుకు స్పందించిన ఆయన అధికారులతో మాట్లాడి చర్యలు చేపట్టేలా చూస్తానని, పాఠశాల భవన నిర్మాణానికి కృషి చేస్తానని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బండ్లగూడ వాసులు చెరుకు భవానిశంకర్, మెట్టు రవిగౌడ్, సహదేవ్, పంగ గౌతం, పాండుగౌడ్, శ్రీనివాస్‌చారి తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

ఎల్.బి.నగర్, అక్టోబర్ 26 ప్రభాతవార్త: వివిధ రంగాలలో కార్మికులుగా పనిచేస్తున్న వారి సమస్యలు పరిష్కరించాలని ఏఐటిసి రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి పానుగంటి పర్వతాలు డిమాండ్ చేశారు. న్యూ నాగోల్ ఎస్ ఏ డాంగే భవన్ లో శనివారం సరూర్ నగర్ మండల సమితి ఏఐటీయూసీ కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. నవంబర్ 5వ తేదీన ఇందిరా పార్క్ లో జరిగే ఆటో డ్రైవర్ సంఘాల ధర్నాను విజయవంతం చేయాలని పోస్టర్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సామిడి శేఖర్ రెడ్డి, పి.నర్సిరెడ్డి, కే.చందు యాదవ్, బాతరాజు నరసింహ, బోయపల్లి రాములు గౌడ్, మద్దిలేటి, సక్రు నాయక్, సత్యనారాయణ, గోపాల్, సురేష్ పాల్గొన్నారు.

మినీ శిల్పారామంలో ఆకట్టుకున్న నాట్య ప్రదర్శనలు

ఉప్పల్ మినీ శిల్పారామంలో కూచిపూడి నాట్య ప్రదర్శనలు ఇస్తున్న కళాకారులు దృశ్యం.

ఉప్పల్, అక్టోబరు 26 ప్రభాతవార్త : ఉప్పల్ మినీ శిల్పారామంలో వారంతపు సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా శనివారం సిద్ద నాట్య కళా సమితి ఆధ్వర్యంలో నాధం, ఉదుకాడు వెంకట కవి రచించిన సంకీర్తనలను కళాకారులు ప్రదర్శనలు ఇచ్చారు. ఈ సందర్భంగా ప్రాణవాకారం, జటాధరా, కళింగ నర్తన, సకళలోక, మాధవ హృదయ, కళ్యాణ రామ తదితర అంశాలను గురు సుధామాల, వాణి రమణి, రేణుక ప్రభాకర్, శ్రీలత, భరణి, నళిని, చంద్రశేఖర్ శిష్య బృందంచే ప్రదర్శనలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి డిప్యూటి డైరెక్టర్ వసుంధర, డా.పి.రమాదేవి, డా.రమాప్రభ, రంజిత్ ఆకుల తదితరులు విచ్చేసి కళాకారులను సత్కరించారు.

హెచ్ఎంటీనర్ చెరువులో గుర్రపు డెక్క తొలగింపు

-పనులను పర్యవేక్షించిన కార్పొరేటర్

గుర్రం డెక్క తొలగింపు పనులను చేయిస్తున్న కార్పొరేటర్ శాంతి సాయిజన్ శేకర్

నాచారం, అక్టోబర్ 26 ప్రభాతవార్త: నాచారం హెచ్ఎంటీనర్ చెరువు గుర్రపు డెక్క తొలగింపు పనులను కార్పొరేటర్ శాంతి సాయిజన్ శేఖర్ శనివవారం పర్యవేక్షించారు.ఈ సందర్భంగా కార్పొరేటర్ గెర్రపు డెక్కల తొలగింపు పనులను త్వరితగతిన చేపట్టిన వెంటనే కార్టింగ్ చేయాలని సిబ్బందికి ఆదేశించారు. ప్రజలకు అసౌకర్యం కలుగకుండా చూస్తామని కార్పొరేటర్ శాంతి సాయిజన్ శేకర్ చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎంటమాలజీ సూపర్‌వైజర్ నరసింహ్మ, మేకల ముత్యం రెడ్డి, విఠల్ యాదవ్, సాయిజన్ శేఖర్ తధితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే ,ఎంపిని కలిసిన కాంగ్రెస్ నాయకులు

**తుర్కయంజా